ఇది కోర్టు గౌరవానికి సంబంధించిన సమస్య

- ఎవరినో రక్షించడానికి ఎస్‌బిఐ తాపత్రయం
- ఎస్‌బిఐ ధిక్కారంపై కపిల్ సిబాల్

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 216 | విజయవాడ, సోమవారం 11 మార్చి 2024 | 6+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 11 March 2024 | Rs

ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్
టైటిల్ విజేత సాత్విక్-చిరాగ్



పారిస్: భారత పురుషుల డబుల్స్ జోడీ మరో టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ప్రపంచ టూర్-750 ఫైనల్లో చైనీస్ తైపీ ద్వయంను చిత్తుచేసి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో వీరు 21-11, 21-17తో లీ-ఝీ, యంగ్ పో-హువాన్‌లను చిత్తుచేసి ఈ ఏడాది తొలి టైటిల్‌ను చేజిక్కించుకున్నారు. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన భారత బృందం.. రెండో గేమ్‌లో ఓ దశలో 9-11పాయింట్లతో వెనుకబడ్డా పుంజుకొని టైటిల్‌ను చేజిక్కించుకోవడం విశేషం.

సిఇసితో విభేదాలే కారణమా?

గోయెల్ రాజీనామాపై అధికార వర్గాల్లో చర్చ • బెంగాల్ పర్యటనలో తెరపైకి అభిప్రాయభేదాలు

- నేరుగా రాష్ట్రపతికి రాజీనామా లేఖ
- 15 కల్లా ఆ రెండు ఖాళీల భర్తీ !

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి మరి కొద్ది రోజులు మాత్రమే గడువు ఉండగా ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ తన పదవికి ఆకస్మికంగా, అనూహ్యంగా రాజీనామా చేశారు. ఆయన నిర్ణయం అనేక మందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు పశ్చిమ బెంగాల్‌లో పర్యటించినప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్‌తో నెలకొన్న విభేదాల కారణంగానే గోయెల్ రాజీనామా చేశారని ఎన్నికల కమిషన్‌లోని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఏప్రిల్, మే మాసాల్లో లోక్‌సభ ఎన్నికలతోబాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుగుతాయి.

మార్చి5న బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోయెల్ పాల్గొనేందుకు నిరాకరించారని ఈ వర్గాలు తెలిపాయి. దీంతో సిఇసి ఒక్కరే ఆ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కారణాలతో గోయెల్ ఢిల్లీకి తిరిగి పయనమయ్యారని సిఇసి వివరణ ఇచ్చారు. అయితే ఈ వాదనను గోయెల్ సన్నిహిత వర్గాలు తోసిపుచ్చాయి. ఆయన ఆరోగ్యం భేషుగ్గా ఉందని చెప్పాయి. 'కొన్ని తీవ్రమైన విభేదాల కారణంగానే గోయెల్ తన బెంగాల్ పర్యటనను కుదించుకొని ఢిల్లీ చేరుకున్నారు' అని ఆ వర్గాలు తెలిపాయి.



అరుణ్ గోయెల్, రాజీవ్‌కుమార్

15కల్లా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం

ఎన్నికల కమిషనర్ అనుప్ పాండే రిటైర్మెంట్, మరో ఎన్నికల కమిషనర్ గోయెల్ ఆకస్మిక రాజీనామాతో ఏర్పడిన రెండు ఖాళీలను మార్చి15 కల్లా భర్తీ చేసే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. న్యాయశాఖ మంత్రి, హోం శాఖ, సిబ్బంది వ్యవహారాల శాఖ కార్యదర్శులతో కూడిన సెర్చ్ కమిటీ అయిదేసి పేర్లతో కూడిన రెండు వేర్వేరు జాబితాలను ప్రధాని, ఆయనచేత నియమించబడ్డ మంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ముందుంచుతుంది. ఆ కమిటీ ఆ రెండు జాబితాల నుంచి ఇద్దరి పేర్లను ఎంపిక చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఎన్నికల కమిషనర్ల నియామకం కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, ఆయన స్థానంలో ప్రధాని చే నియమించబడిన మంత్రికి స్థానం కల్పించారు. దీంతో ఎన్నికల కమిషనర్ల నియామకంపై ప్రభుత్వం పూర్తిగా పట్టు బిగించింది.

ఇంతకీ ఏం జరిగింది..?

భారత ఎన్నికల సంఘంలోని ఈ ఇద్దరు అధికారుల మధ్య ఏం జరిగింది? ఆ విభేదాలు ఏమిటి? ఏయే అంశాలపై అభిప్రాయభేదాలు తలెత్తాయి? అనే విషయాలు తెలియడం లేదు. గోయెల్ సన్నిహిత వర్గాలు కానీ, ఇసి వర్గాలు కానీ దీనిపై పెదవి విప్పడం లేదు. ఈ నెల మిగతా 5లో



సిద్ధం సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రానికి ద్రోహం చేసిన వారు
పొత్తులతో వస్తున్నారు!

- నోటాకు వచ్చిన ఓట్లు కూడా రానివారు పొత్తులు పెట్టుకుంటున్నారు
- మేదరమెట్ల 'సిద్ధం' సభలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలు, ప్రజల చేతిలో చిత్తుగా ఓడిన వారు పొత్తులతో ఎన్నికల బరిలో దిగుతున్నారని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. నోటాకు వచ్చిన ఓట్లు కూడా రానివారు పొత్తులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పొత్తుల పార్టీల్లో సైన్యాధిపతులే ఉన్నారని, సైన్యం లేదని విమర్శించారు. బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలో దిగడం పట్ల తనదైన శైలిలో ఆ పార్టీలను విమర్శించారు. అయితే, ఎక్కడా నేరుగా బిజెపి పేరుగానీ, ప్రధాని మోడీ పేరుగానీ ప్రస్తావించలేదు. చంద్రబాబుకు ఉన్నట్లుగా తనకు పొలిటికల్ స్టార్స్ లేరన్నారు. నక్షత్రాలు ఎన్ని ఉన్నాయో అంతటి ప్రజా స్టార్స్ తన వైపు ఉన్నారని, వారంతా తన స్టార్ క్యాంపెయినర్లని పేర్కొన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, బాబు అండ్ కో పొత్తులతో వస్తోందని అన్నారు. పొత్తుల కోసం చంద్రబాబు తన దత్తపుత్రునితో కలిసి కేంద్రం ముందు మోకరిల్లారని దుయ్యబట్టారు. తమ ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరిగి గ్రామగ్రామానా అభివృద్ధి పనులు చేపట్టారు. చంద్రబాబు కేంద్రం గడప, ఎల్లో మీడియా అధిపతుల గడపల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. 14 ఏళ్ల పాటు సిఎంగా ఉండి చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. ఇప్పుడు పొత్తులతో వస్తున్న ఈ పార్టీలు 2014లో కూడా చాలా హామీలు ఇచ్చాయని, అందులో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని వివరించారు. ప్యాకేజీ స్టార్ సైకిల్ సీట్లు అడగరని, చంద్రబాబు సైకిల్ ఎక్కమంటే ఎక్కుతారని, దిగమంటే దిగుతారని దుయ్యబట్టారు. చంద్రబాబు మేనిఫెస్టోకు శకుని పాచికలకు తేడా మిగతా 2లో

ఇసిలో అనిశ్చితికి దారితీసిన పరిస్థితులపై
కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలి

- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల కమిషనర్ ఒకరు గత నెలలో పదవీ విరమణ చేయగా, మరో కమిషనర్ తన రిటైర్మెంట్‌కు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉండగానే అకస్మాత్తుగా రాజీనామా చేయడంతో భారత ఎన్నికల సంఘంలో ఒక్క చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తప్ప మిగతా కమిషనర్లు ఎవరూ లేని పరిస్థితి నెలకొనడం పట్ల సిపిఐ(ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అనిశ్చితి ఎందుకేర్పడిందో, దానికి దారితీసిన పరిస్థితులేమిటో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని మార్క్సిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. భారత ఎన్నికల సంఘంలో చోటు చేసుకున్న ఆకస్మిక పరిణామాలు పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని, ఎన్నికల కమిషనర్లలో ఒక స్థానం ఇప్పటికే ఖాళీగా ఉండగా, మరో కమిషనరు రిటైర్మెంట్‌కు ఇంకా మూడేళ్లు ఉండగానే అకస్మాత్తుగా రాజీనామా చేయడం, వెంటనే ఆ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదం తెలపడం చకచకా జరిగిపోయాయని, పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికలకు దేశం సిద్ధమవుతున్న తరుణంలో ఇటువంటి గందరగోళ పరిస్థితి నెలకొనడం మంచిది కాదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చి ఎన్నికల కమిషనర్ల నియామక అధికారాన్ని పూర్తిగా తన గుప్పెట్లో పెట్టుకుందని, దీంతో ఎన్నికలు స్వేచ్ఛగా,న్యాయంగా నిర్వహించడంలో ఈ రాజ్యాంగ సంస్థ సమర్థత, దాని విశ్వసనీయతపై అనుమానాలు తలెత్తుతున్నందున వీటిపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ఈ అనిశ్చితికి దారితీసిన పరిస్థితులేమిటో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటనతో ముందుకు రావాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

మన్యం బంద్ జయప్రదం

- మూతపడ్డ దుకాణాలు, పర్యాటక కేంద్రాలు
- నిలిచిన ప్రయివేటు వాహనాలు
- జిఒ 3 పునరుద్ధరణ, గిరిజన స్పెషల్ డిఎస్‌సి కోసం గొంతెత్తిన గిరిజనం



అరకులోయలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం మన్యం బంద్ విజయవంతమైంది. జిఒ 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని, గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీ అభ్యర్థులకే కేటాయించాలని, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని తదితర డిమాండ్లతో ఆదివాసీ గిరిజన సంఘం, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యాన తలపెట్టిన ఈ బంద్‌కు ఆదివాసీల నుంచి పూర్తి మద్దతు లభించింది. వర్తక, వాణిజ్య, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. బంద్‌లో భాగంగా ఎక్కడికక్కడ ర్యాలీలు, రాస్తా రోకోలు నిర్వహించారు. వాహన రాకపోకలు నిలిచి పోయాయి. ప్రభుత్వం పోలీసు బందోబస్తుతో కొన్నిచోట్ల ఆర్‌టిసి బస్సులను తిప్పాలని చూసినా జనం వాటిలో పల్చగా కనిపించారు. పలుచోట్ల రోడ్డెక్కిన బస్సులను బంద్ నిర్వాహకులు అడ్డుకున్నారు. బంద్‌కు సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీలతోపాటు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని ప్రధాన రహదారులు బోసిపోయాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో బంద్ నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య, గిరిజన డిఎస్‌సి సాధన కమిటీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బంద్ విజయవంతానికి కృషి చేస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధర్మన్న పడాల్, సుందర్‌రావులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరకులోని పర్యాటక కేంద్రాలైన పద్మావతి గార్డెన్, మిగతా 2లో

బిజెపితో పొత్తు హేయం

- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీతో దోస్తీనా?
- నెల్లూరు నగరం నుంచి సిపిఎం పోటీ : శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడం హేయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. బిజెపితో పొత్తు కుదిరి ఎన్‌డిఎలో చేరుతున్నట్లు టిడిపి, జనసేన ప్రకటించాయని, రాష్ట్ర ప్రయోజనం కోసం కలుస్తున్నామని, స్వర్ణయుగం తెస్తామని చెబుతున్నారని అన్నారు. భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, ఇది లొంగుబాటు అని విమర్శించారు. ఈ పొత్తు బిజెపి విద్రోహానికి అధికార ముద్ర వేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 2014లో టిడిపి, బిజెపి పొత్తు పెట్టుకున్నాయని, 2014 నుంచి 2019 వరకు ఏం సాధించారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా హక్కును ఫణంగా పెట్టి, ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ఏమీ లేకుండా పదేళ్ల రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారన్నారు. రాజధాని కడతామని సింగపూర్, జపాన్ పేర్లు చెప్పి చివరికి రాజమౌళి సెట్టింగ్‌లతో కాలం గడిపారని విమర్శించారు. పొత్తు ద్వారా రాష్ట్ర ప్రజలను మోసగించడానికి సిద్ధమయ్యారని అన్నారు. లౌకికతత్వం వదిలేసి, మతోన్మాదం వైపు చంద్రబాబు వెళుతున్నారని విమర్శించారు. ఈ పార్టీల పొత్తు టిడిపిలోని ఏ ఒక్క నాయకునికీ ఆమోదం కాదని, ఆ పొత్తు రాష్ట్రాభివృద్ధి కోసం కాదని, కేవలం స్వార్థ రాజకీయాల కోసమేనని వివరించారు. బిజెపి ధృతరాష్ట్ర కౌగిలిలాంటిందని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలు దెబ్బతిన్నాయని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీలకు అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. 2014లో గుజరాత్ తరహా అభివృద్ధి చేస్తానని చెప్పారని, 2019లో పుల్వామా ఘటనను ముందుకు తీసుకొచ్చారని, ఇప్పుడు రామమందిరం నినాదంతో ముందుకు వస్తోందని వివరించారు. ఇటీవల చంద్రబాబు జైలుకు వెళ్లడానికి బిజెపి పాత్ర ఉందని, అయితే, తన అరెస్ట్‌కు బిజెపి పాత్ర లేదని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందని శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు తమ హయాంలో 74 శాతం పూర్తి చేశామని మిగతా 2లో

పాక్ అధ్యక్షుడిగా జర్దారీ ప్రమాణస్వీకారం



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ 14వ అధ్యక్షుడిగా అసిఫ్ అలీ జర్దారీ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. 68 ఏళ్ల జర్దారీ చేత పాక్ అధ్యక్ష భవనం ఐవాన్-ఎ-సదర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి ఖాజీ ఫేజ్ ఇసా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, త్రివిధ దళాధిపతులు, సీనియర్ అధికారులు, దౌత్యవేత్తలు హాజరయ్యారు. శనివారం జరిగిన ఎన్నికల్లో పిటిఐ మద్దతుగల సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ (ఎస్‌ఐసి) అభ్యర్థి మహమూద్ ఖాన్ అచ్కజైపై పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) కో-చైర్మన్, అధికార కూటమి ఉమ్మడి అభ్యర్థి జర్దారీ ఘన విజయం సాధించారు. జర్దారీకి 411 ఎలక్ట్రోరల్ ఓట్లు రాగా, మహమూద్ ఖాన్‌కు కేవలం 181 ఓట్లు మాత్రమే వచ్చాయి. పాక్ అధ్యక్షుడిగా జర్దారీ ఎన్నిక కావడం ఇది రెండోసారి. గతంలో 2008 నుంచి 2013 వరకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.

సామాన్యుని సందేహాలు...!

గిరిపుత్ర

రాష్ట్ర విస్తృత ప్రయోజనాల కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా పని చేయాలని నిర్ణయించినట్టు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారంనాడు ఢిల్లీలో మీడియాతో చెప్పారు. అయితే ఆ మూడు పార్టీల కూటమివల్ల రాష్ట్ర ప్రయోజనాలు ఏమి నెరవేరుతాయో, అదెలాగో మాట మాత్రంగా కూడా ఆయన చెప్పకపోవడంతో సామాన్యులకు పలు సందేహాలు కలుగుతున్నాయి. ఐదేళ్ల క్రితం ధర్మ పోరాట దీక్ష పేరిట భారీ బహిరంగసభలు నిర్వహించి రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని విమర్శించిన చంద్రబాబుకు ఇప్పుడు బిజెపిలో ఏం మార్పు కనిపించింది? 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న మహాకవి గురజాడ సూక్తి ప్రకారం ఈ నిర్ణయంవల్ల ప్రజల ప్రయోజనాలు ఏవైనా నెరవేరుతాయా... లేక అధినాయకత్వానికి లేదంటే కొందరు నాయకుల ప్రయోజనాలు నెరవేరుతాయా అన్నది అసలు ప్రశ్న. తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన తెలుగుదేశం పార్టీకి అధినేతగా వున్న చంద్రబాబు పొత్తుపై ఢిల్లీ పాలకుల నిర్ణయం కోసం రెండు రోజులపాటు వారి గడప ముంగిట పడిగాపులు కాయడం పలువురిని కలచివేసింది.

ప్రత్యేక హోదా ఏమైనట్టు..!

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పన కీలక సమస్య. అది ముగిసిన అధ్యాయం అని చెప్పిన బిజెపి ఇప్పుడు తన వైఖరి మార్చుకుందా? ఎపికి హోదా మంజూరు చేస్తామని మాట ఇచ్చిందా? ఇవ్వదని తెలిసినా టిడిపి, పాచిపోయిన లడ్డూలని ఒకనాడు విమర్శించిన జనసేన ఇప్పుడు పొత్తు కుదుర్చుకున్నాయా?

విశాఖ ఉక్కు సంగతేమిటి..?


'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అంటూ 32 మంది ప్రాణ బలిదానంతో సాధించుకున్న ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తామని బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దానికి వ్యతిరేకంగా దాదాపు మూడేళ్లకు పైగా ఉక్కు కార్మికులు పోరాడుతుంటే వివిధ సందర్భాల్లో రాష్ట్ర ప్రజలు సంఘీభావం తెలుపుతున్నారు. ప్రజల వ్యతిరేకత మూలంగా ప్లాంటు మొత్తాన్ని ఒకేసారి ప్రైవేటుపరం చేయలేని కేంద్రం ముక్కలు ముక్కలుగా అమ్మేయాలని ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను జిందాల్‌కు అప్పగించింది. ఇప్పుడేమైనా బిజెపి తన ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుందా? విశాఖ స్టీల్‌కు కీలకమైన సొంత గనుల కేటాయింపునకు కేంద్రం అంగీకరించిందా? అలా కాకపోతే 'ఉక్కు' ఏమైపోయినాగాని ఆ పార్టీలకు పొత్తే ప్రధానమా?

పోలవరం మాటేమిటి..!

గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడానికి, కరువు పీడిత రాయలసీమకు నికర జలాలివ్వడానికి రాష్ట్రానికి జీవధారగా పోలవరం ప్రాజెక్టును పేర్కొంటారు. అందుకు సంబంధించిన డ్యామ్, ఇతర కట్టడాలు, కాల్వల పనులు చేశారేతప్ప సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా పేర్కొన్నప్పటికీ నిర్వాసితులకు ప్యాకేజి, నిర్మాణ అంచనాలపైనా కేంద్రం కొర్రీలు వేయడమేతప్ప తగిన నిధులివ్వడం లేదు. తాజా అంచనాలతో నిర్మాణ వ్యయాన్ని, పునరావాస పునర్నిర్మాణ ప్యాకేజిని కేంద్రమే పూర్తిగా భరిస్తుందనీ బిజెపి చంద్రబాబుకు మాట ఇచ్చిందా? అలాంటిదేమీ లేకుండానే మూడు పార్టీల కూటమి పాట పాడుతున్నారా?

కడప ఉక్కు ఊసేదీ..!

కడపలో ప్రభుత్వరంగ ఉక్కు కర్మాగార నిర్మిస్తామని విభజన చట్టంలో పేర్కొన్నారు. కానీ ఈ పదేళ్లలో దాని ఊసే లేదు. కేంద్రాన్ని నిలవెయ్యడం మానేసి గతంలో టిడిపి, ఆ తరువాత వైసిపి ప్రభుత్వాలు ప్రైవేటు రంగంలో నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడం తప్ప ముందడుగు లేదు. రాయలసీమ పారిశ్రామికాభివృద్ధికి ప్రధానమైన కడప ఉక్కుపై బిజెపి ఏమైనా పెదవి విప్పిందా? మూడు వేలకోట్ల రూపాయలకుపైగా వెచ్చించి నిర్మిస్తామన్న మన్నవరం ప్రాజెక్టు గురించి కేంద్ర ప్రభువులు ఏమైనా చెప్పారా? ఇవేవీ లేకుండా సీమ అభివృద్ధి మాటలకే పరిమితమా?



రాజధాని అంటే మట్టి, నీళ్లా..?

ఢిల్లీ తలదన్నే రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరిస్తుందని గొప్పగా చెప్పిన ప్రధాని మోడీ అమరావతికి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి పోయారుతప్ప మహానగర నిర్మాణానికి వలయు నిధులివ్వలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా ఉండాలని అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసినా వైసిపి సర్కారు మూడు రాజధానుల పేరిట గందరగోళం సృష్టించింది. అప్పుడు కూడా రాజధాని అమరావతి కొనసాగాలని చెప్పలేదు సరికదా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంటుందని వైసిపి విధానాన్ని పరోక్షంగా సమర్థిస్తూ మోడీ ప్రభుత్వం రాష్ట్ర హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన మాట నిజం కాదా? మరి ఆ వైఖరిని ఇప్పుడు మార్చుకుంటానని బిజెపి స్పష్టం చేసిందా? అలా కాకపోతే అమరావతి రైతులకు, ప్రజలకూ టిడిపి, జనసేన ఏం చెబుతాయి?

ఎన్‌డిఎ తో సామాజిక న్యాయమా..!

మోడీ అధికారానికి వచ్చిన ఏడాదికే ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టానికి సవరణ తెచ్చారు. అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. రాజ్యాంగంలోని 370 అధికరణం రద్దు, జమ్ము కాశ్మీర్‌ను ముక్కలు చేయడం చూశాం. మైనారిటీలపై సిఎఎ, ఎన్‌ఆర్‌సి కత్తి దూశారు. దేశానికి మాయనిమచ్చ లాంటి మణిపూర్ మారణహోమం గురించి చెప్పనక్కరలేదు. తాజాగా ఏకరూప పౌర స్మృతిని రుద్దడానికి యత్నిస్తున్నారు. అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ట పేరుతో ఊరూరా మత విద్వేషం రెచ్చగొట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అణగారిన తరగతులవారిపై దాడులు, హత్యాచారాలు సాగుతున్నాయి. ఇదంతా ఎన్‌డిఎ పాలన నిర్వాకమే కదా! అయినా, 'మేం ఎన్‌డిఎ లో చేరిన విషయాన్ని మైనారిటీలు అర్థం చేసుకుంటారు.' అని చంద్రబాబు చెప్పడం మైనారిటీలను, అణగారిన సామాజిక తరగతులను మభ్యపుచ్చడమే!

ఎందుకీ ఆత్మవంచన..!

తొమ్మిదేళ్లపాటు ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రతిపక్ష నాయకునిగా ఉన్న చంద్రబాబు నాయుడ్ని సిఐడి పోలీసులు అర్ధరాత్రి వేళ భీతావహం సృష్టించి అరెస్టు చేశారు. అయితే ఆ కేసులో ప్రాథమిక ఆధారం కేంద్ర ప్రభుత్వ జిఎస్‌టి ఇంటిలిజెన్స్ విభాగంవారు నమోదు చేసిన అంశాలే కదా! సిబిఐ కోర్టు మొదలు సుప్రీం కోర్టు వరకూ అవే వాదనలు కదా! వాస్తవాలలా ఉండగా 'నా అరెస్టుకు కేంద్రం మద్దతు ఉందనడం సరికాదు' అని చంద్రబాబు శనివారం నాడు ఢిల్లీలో చెప్పడం ఎవరిని మభ్య పుచ్చడానికి? లేదా సంతృప్తి పరచడానికి? ఇంతలా ఆత్మవంచనకు పాల్పడవలసిన అవసరం ఏమొచ్చింది?

విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావలసిన విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక ఉన్నత విద్యా వైద్య సంస్థలు, పెట్రో కెమికల్ కారిడార్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి వంటి అనేక అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోంది. అయినా... ఎన్‌డిఎ తోనే ఎందుకు వెళ్లాలి? ఈ రాష్ట్రానికి, తెలుగువారికీ ఒరిగేదేమిటన్నది టిడిపి, జనసేన నేతలు ప్రజలకు వివరించాలి మరి!

'ఫార్మా' వ్యర్థాలతో ఉపాధికి గండి

- కలుషిత జలాల విడుదలకు సముద్రంలోకి అరబిందో పైపులైన్లు
- మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం
- ఆందోళన బాటలో గంగపుత్రులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ సెజ్ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు తీర ప్రాంతాలను నాశనం చేస్తున్నాయి. అవి విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో పచ్చని పంట పొలాలు, తాగు నీరు ఇప్పటికే కలుషితం అవుతున్నాయి. సముద్రంలోకి వైపు లైన్ల ఏర్పాటుతో ఆ జలలూ కలుషితం కానున్నాయని మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వైపులైన్లను తొలగించాలని, విషపూరిత, కలుషిత జలాలను సముద్రంలోకి విడుదల చేయరాదని డిమాండ్ చేస్తూ యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట కేంద్రంగా రెండో దఫా ఆందోళన గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. కెఎస్‌ఇజెడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీలు ఉన్నాయి. అరబిందో కంపెనీ కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట, తొండంగి మండలం పెరుమాళ్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల మేర భారీ పైపులైన్లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను సముద్రంలోకి నేరుగా కలిసి మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా తమ ఉపాధికి గండి పడుతుందంటూ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పాడ నుంచి అద్దరిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, అమీనాబాద్, సుబ్బంపేట, మూలపేట, రామన్నపాలెం, శీలవారి పాకల, కోనపాపపేట, కొత్త మూలపేట, తొండంగి మండలం తొండంగి, వేమవరం, శృంగవృక్షం, పిఇ చిన్నయ్యపాలెం, పెరుమళ్లపురం, ఎవి.నగరం, ఎల్లయ్యపేట, పంపాదిపేట, ఒంటిమామిడి, దానవయ్యపేట తదితర గ్రామాల్లో సుమారు 50 వేల మంది మత్స్యకార కుటుంబాలు సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. ఫార్మా పరిశ్రమ విషపూరిత, వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచి పెట్టేందుకు వేస్తున్న పైపులైన్ల వల్ల సకల మత్స్య సంపద, సముద్ర జీవ రాశులు కనుమరుగవుతాయంటూ ఆందోళన బాటపట్టారు. అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో తమకు జీవనోపాధి కల్పిస్తున్న బోటుని తగలబెట్టి, కొందరు ఒంటిపై పెట్రోల్ పోసుకుని శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రెండు నెలల క్రితం ఆందోళన చేపట్టగా సందర్భంగా తమకు న్యాయం చేస్తామని స్థానిక ఎంఎల్‌ఎ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోకపోవడంతో మళ్లీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని మత్స్యకారులు చెప్తున్నారు. కాకినాడ ఎంపీ వంగా గీత అధికారులతో సోమవారం చర్చలు ఏర్పాటు చేస్తామని శనివారం హామీ ఇచ్చారు. మత్స్యకారుల ఆందోళనకు సిపిఎం నాయకులు, ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మద్దతు పలికాయి. అధికారులు వెంటనే స్పందించి పైపులైను తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఫార్మా కంపెనీల పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సముద్రంలోకి అరబిందో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసిన భారీ పైపు లైన్లు

మత్స్య సంపద కనుమరుగు



పైప్‌లైన్ వల్ల మా కళ్లెదుటే మత్స్య సంపద నాశనం అవుతుంటే చూస్తూ ఊరుకోలేం. వేట సమయంలో పైపులైను వలలకు చిక్కుకొని లక్షల ఖరీదైన వలలు, బోట్లు నాశనం అవుతున్నాయి. వైపు లైన్‌ను తొలగించి మాకు న్యాయం చేయాలి.

- గంపల దేవుడు, మత్స్యకారుడు, కోనపాపపేట, యు.కొత్తపల్లి మండలం

పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది



పైపులైన్ల ఏర్పాటుపై గత నాలుగు నెలలుగా అభ్యంతరం తెలియజేస్తున్నా అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులు గానీ సమస్యకు పరిష్కారం చూపడం లేదు. విషపూరిత, కలుషిత జలాలను, వ్యర్థ పదార్థాలను సముద్రంలోకి నేరుగా వదలడం వల్ల మత్స్య సంపద గుడ్డు దశలోనే నశించిపోయే ప్రమాదం ఉంది. మేము ఉపాధి కోల్పోడంతోపాటు పర్యావరణ సమతుల్యతకూ నష్టం వాటిల్లుతుంది.

-ఎ.సత్తిబాబు, మత్స్యకారుడు, కోనపాపపేట, యు.కొత్తపల్లి మండలం

నేడు విద్యుత్ టారిఫ్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌ను విడుదల చేయనుంది. ఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి నాగార్జునరెడ్డి విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయం వద్ద ఉన్న రైతు శిక్షణా కేంద్రంలో విడుదల చేయనున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఎపిఇఆర్‌సి తొలిసారి విజయవాడలో టారిఫ్‌ను విడుదల చేస్తుంది. రైల్వేకు అందిస్తున్న విద్యుత్‌పై యూనిట్‌కు అదనంగా రూ.1 పెంచాలని విద్యుత్ పంపిణీ సంస్థలు తమ ఆదాయ వార్షిక నివేదిక (ఎఆర్ఆర్)లో ఇఆర్‌సికి ప్రతిపాదించాయి. విద్యుత్ వాహనాల స్టేషన్ల నిర్వహణ కింద అందించే సబ్సిడీని తొలగించాలని ప్రతిపాదించాయి. దీని ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.251.33 కోట్ల భారం మోపాయి. ఎఆర్ఆర్‌పై ఇఆర్‌సి జనవరి 29, 30, 31 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించింది.

మూఢనమ్మకాలకు అక్కా తమ్ముడు బలి

- చాగలమర్రిలో విషాదం

ప్రజాశక్తి - చాగలమర్రి (నంద్యాల జిల్లా)

నీటమునిగితే అనారోగ్యం నయమవుతుందనే మూఢ నమ్మకాలకు అక్కాతమ్ముడు బలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండ్ కాలనీకి చెందిన షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఇమామ్‌బీ భార్యాభర్తలు. ఇమామ్‌బీ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బావమరిది ఫకీర్‌మస్తాన్‌తో కలిసి నంద్యాల జిల్లా ఎర్రగుంట్ల దర్గా వద్ద పూజలు చేశారు. చాగలమర్రికి వెళుతూ కూలూరు గ్రామ సమీపంలోని కుందూనదిలో స్నానాలు చేసి తిరిగి చూడకుండా వెళ్లాలని దర్గాలోని స్వామి చెప్పారు. దీంతో ముగ్గురు కలిసి కుందూనది వద్దకు వెళ్లారు. షేక్ ఖాజా హుస్సేన్ కుందునది ఒడ్డున ఉండగా షేక్ ఇమాంబి (27), ఫకీర్ మస్తాన్ (26) ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోయి మరణించారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు రాజుపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకట్రెండు రోజుల్లో స్పష్టత

- పోటీ చేసే స్థానాలపై పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి, బిజెపి, జనసేన ఎక్కడ పోటీ చేస్తారనే అంశంపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని ఎపి బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి అన్నారు. బిజెపి జాతీయ నాయకులు గజేంద్రసింగ్ షెకావత్‌తో ఆదివారం విజయవాడలో పురందేశ్వరి చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీట్ల విషయంలో కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బిజెపి మేనిఫెస్టో రూపకల్పనకు అభిప్రాయ సేకరణ చేపట్టనున్నామన్నారు. ఆదివారం రాత్రి పవన్‌కల్యాణ్ కూడా షెకావత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కృష్ణపట్నం పోర్టులో ఉద్రిక్తత

- పార్టీల నాయకులను అడ్డుకున్న యాజమాన్యం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ ఉద్యోగుల నిరసనకు మద్దతుగా వెళ్లిన సిపిఐ, టిడిపి, జనసేన పార్టీ నాయకులను పోర్టు యాజమాన్యం అడ్డుకుంది, కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు, మూసివేతను నిలుపుదల చేయాలని గత కొద్ది రోజులుగా సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన పార్టీలు ఆందోళన నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతలు ఆదివారం పోర్టులోకి వెళ్లడానికి ప్రయత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొని లోనికి వెళ్లడానికి అనుమతి లేదన్నారు. దీంతో నాయకులకు, సెక్యూరిటీకి వాగివ్వాదం జరిగింది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేతతో ఉద్యోగాలు కోల్పోయిన వారి నిరసనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చామని, ఎందుకు అనుమతి ఇవ్వరని ప్రశ్నించారు. ఫిబ్రవరి 8న పోర్టు సిఇఒ జిజె రావును కలిశామని, 15 రోజుల్లో కంటైనర్ టెర్మినల్ సేవలు పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గడువు ముగియడంతో ఇచ్చిన హామీ అమలుపై ఆయన తీసుకున్న చర్యలను తెలుసుకునేందుకు సంప్రదించామన్నారు. అన్ని పోర్టులు వెజల్స్ షెడ్యూల్ ఇస్తున్నా అదానీ కష్ణపట్నం పోర్టు నుంచి మాత్రం ఎలాంటి షెడ్యూల్ లేదన్నారు. ఈ రోజుకీ జీరో షెడ్యూలే ఉందని తెలిపారు. ఖాళీ కంటైనర్లతో షో చేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి అన్ని పోర్టుల షెడ్యూళ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దుమ్ము, ధూళి కారణంగా నాలుగున్నర పుట్లు పండే భూమి రెండున్నర పుట్లకు తగ్గిపోయిందని, పది వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. అధికారులు స్పందించకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. టిడిపి నేత బొమ్మి సురేంద్ర, దామా అంకయ్య, జనసేన బి సురేష్‌నాయుడు, టిడిపి ఈదూరు రామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కృష్ణాపట్నం పోర్టులో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

టిడిపి నేతల్లో టికెట్ టెన్షన్!

- త్యాగాలు తప్పవంటున్న అధినేత
- రెండో జాబితాపై ఆశలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో టెన్షన్ నెలకొంది. పొత్తులో భాగంగా తమకు టికెట్ దక్కుతుందా? లేదా? అనేది కొంతమందిలో ఉండగా, ఇంటిపోరులో నెగ్గి టికెట్ సాధించగలమా? అని మరికొంతమందిలో, కొత్తగా పార్టీలో చేరిన నేతలతో తమకు టికెట్ వస్తుందా? లేదా అనే ఆందోళనలో ఇంకొందరు నేతలు ఉన్నారు. టిడిపి-జనసేన ఉమ్మడిగా 99 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాయి. ఇంకా 76 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ 76 చోట్ల ఎవరు? ఎక్కడ పోటీ చేస్తారనే దానిపై నేతల్లో ఉత్కంఠ నెలకొంది. పొత్తులో భాగంగా 30 అసెంబ్లీ స్థానాలను మిత్రపక్షాలైన జనసేన, బిజెపిలకు కేటాయించినట్లు సమాచారం. ఇందులో కేవలం 5 స్థానాలకు జనసేన తన అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా 25 స్థానాల్లో తమ అభ్యర్థులను జనసేన-బిజెపి ప్రకటించాల్సి ఉంది. మిగతా 51 స్థానాల్లో టిడిపి తన అభ్యర్థులను పెండింగ్‌లో ఉంచింది. పెండింగ్‌లో ఉన్న స్థానాల్లో చంద్రబాబు ఐవిఆర్‌ఎస్ సర్వే ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఓటర్లకు ఫోన్లు చేసి ఏ అభ్యర్థిని మీరు కోరుకుంటున్నారని అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కొత్త నేతల పేర్లు రావడంతో టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి కృష్ణాలో పెనమలూరుకు తొలి నుంచి బోడె ప్రసాద్ అభ్యర్థిగా సర్వే చేపట్టారు. మైలవరం సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ టిడిపిలో చేరడంతో అక్కడ ఉన్న టిడిపి ఇన్‌ఛార్జి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో పెనమలూరులో సర్వే చేపట్టారు. దీంతో ఇప్పుడు పెనమలూరు టికెట్ దేవినేనికా? బోడెకా? అనే ఉత్కంఠ నెలకొంది. గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌తోపాటు అక్కడ టికెట్ ఆశిస్తున్న భాష్యం ప్రవీణ్ పేరుతో కూడా పార్టీ సర్వే చేపట్టింది. దీంతో ఇక్కడ ఎవరికిస్తారనే ఆందోళన నెలకొంది.

పొత్తుతో ముడిపడ్డ స్థానాలివే..!

రాష్ట్రవ్యాప్తంగా 33 స్థానాలు పొత్తుతో ముడిపడి ఉన్నట్లు టిడిపి నాయకులు చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో పలాస, పాలకొండ, విశాఖ ఉత్తరం, దక్షిణం, భీమిలి, యలమంచిలి, పెందుర్తి, మాడుగుల స్థానాలు పొత్తుతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పిఠాపురం, కాకినాడ అర్బన్, రామచంద్రాపురం, రాజమండ్రి రూరల్, అమలాపురం, పోలవరం, నరసాపురం, నిడదవోలు, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం వంటి స్థానాల్లో జనసేన-బిజెపి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కైకలూరు, విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ, గుంటూరు పశ్చిమ, దర్శి స్థానాలు పొత్తులో ముడిపడి ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో శ్రీకాళహస్తి, మదనపల్లి, అనంతపురం, కదిరి, ధర్మవరం, రైల్వే కోడూరు, జమ్మలమడుగు స్థానాలు పొత్తులో భాగంగా మిత్రపక్షాలకు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఈ నియోజకవర్గాల నుంచి సీటు ఆశిస్తున్న నేతలతో చంద్రబాబు ఇప్పటికే చర్చలు జరిపారు. పొత్తులో భాగంగా సీటు ఎవరికి వచ్చినా గెలిపించేందుకు పనిచేయాలని చెప్పారు.

సీనియర్లకూ నిరీక్షణే

టిడిపిలో ఈసారి సీనియర్లకు టికెట్ కోసం నిరీక్షణ తప్పలేదు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కళా వెంకట్రావు, ఆనం రామనారాయణ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి బుద్ధప్రసాద్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, పీతల సుజాత, చింతమనేని ప్రభాకర్, బండారు సత్యనారాయణమూర్తి, యరపతనేని శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శ్రీధర్ రెండో జాబితాపై ఆశలు పెట్టుకున్నారు.

వీరిలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కళా వెంకట్రావుకు టికెట్ లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కళా వెంకట్రావు ఎచ్చెర్ల సీటును ఆశిస్తున్నారు. అక్కడ అప్పలనాయుడుకు ఇచ్చే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. కళాను విజయనగరం లోక్‌సభ నుంచి పోటీ చేయాలని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. సోమిరెడ్డి ఆశిస్తున్న సర్వేపల్లి టికెట్‌ను ఇటీవల టిడిపిలో చేరిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి ఇచ్చే అవకాశం ఉంది.

రాష్టానికి ద్రోహం చేసిన వారు పొత్తులతో వస్తున్నారు!



సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. అందుకే పక్క రాష్ట్రాల నుంచి తీసుకుని చంద్రబాబు కిచిడి వాగ్దానాలు చేస్తున్నారని విమర్శించారు.

త్వరలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల

ఎన్నికల మేనిఫెస్టో త్వరలో విడుదల చేస్తామని, చేయగలిగిందే చెబుతానని జగన్ వెల్లడించారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, అక్కాచెల్లెమ్మల ముఖం మీద చిరునవ్వులు ఉండాలన్నదే తన కల అని తెలిపారు. కరువు లేకుండా వ్యవసాయాన్ని మార్చుతామని, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌సి, మైనార్టీలు, బిసిలు పేదరికంలో ఉండకూడదని, పేదలు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదని అన్నారు. పారిశ్రామికంగా, మౌలిక సదుపాయాలపరంగా వేగంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికీ, ప్రతి ఇంటికీ, ప్రతి పేదవాడికీ మంచి చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మీ జగనన్న అధికారంలోకి మళ్లీ రావాల్సి ఉందని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోయి పేదలు నష్టపోతారన్నారు. కార్యకర్తలకు తాను ఇచ్చిన పదవులు గతంలో ఏ పార్టీ ఇవ్వలేదని పేర్కొన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానన్నారు. రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకూ ప్రతి ఇంటికీ మంచి జరిగినట్లు తెలిపారు. అందుకే వై నాట్ 175 అని చెబుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మొత్తం ఎమ్మెల్యే, ఎంపి సీట్లు గెల్చుకుంటామని అన్నారు. ఈ సభలో మంత్రులు కాకాని గోవర్ధనరెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీ నందిగం సురేష్, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అనీల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

తొక్కిసలాటలో పారిశుధ్య కార్మికుడు మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

సిద్ధం సభలో అపశృతులు చోటు చేసుకున్నాయి. సభలో తొక్కిసలాటలో పారిశుద్ధి కార్మికుడు, సభ అనంతరం వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించారు. ఈ ఘటనలకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... కోరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఒంగోలు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పాలపర్తి మురళి (35) సభ దగ్గర విధులు నిర్వహిస్తూ తొక్కిసలాట కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. ఆయనను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్ధం సభకు వెళ్లిన పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం చంద్రబాబు కాలనీకి చెందిన గేదెల బాలదుర్గ (27) అనే యువకుడు తిరుగు ప్రయాణంలో అద్దంకి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తాను వెళ్లిన బస్సే ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జి.అనిత, ఫొటోలో తెలకపల్లి రవి, లక్ష్మయ్య, సత్యాజీ, మోహన్, ఆనందాచారి, శాంతిశ్రీ

ఆశయ పథంలో అక్షర గమనం

- 'సాహిత్య ప్రస్థానం' 20 వసంతాల ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో తెలకపల్లి రవి

ప్రజాశక్తి-విజయవాడ

ఏ ప్రమాణాలు, లక్ష్యాలతోనైతే ప్రారంభించబడిందో అదే ఆశయంతో 20 ఏళ్లుగా 'సాహిత్య ప్రస్థానం' కొనసాగుతుందని, ప్రజాసాహిత్యం అందిస్తూ ముమ్ముందుకు సాగుతోందని సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. 'సాహిత్య ప్రస్థానం' 20 వసంతాల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. ప్రస్థానం 20 వసంతాల ప్రత్యేక సంచికను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి అనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి మాట్లాడుతూ, నేడు కేంద్రంలోని మతతత్వ పాలకుల ఏలుబడిలో రాజ్యాంగ విలువలు, లౌకికతత్వం ప్రమాదంలో పడ్డాయని, భిన్నాభిప్రాయానికి తావులేని నిరంకుశత్వం కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి ప్రమాదాన్ని కవులూ రచయితలూ కళాకారులూ ఉమ్మడిగా ప్రతిఘటించాల్సిన అవసరాన్ని సాహిత్య ప్రస్థానం ఇరవై ఏళ్ల కిందటే గుర్తు చేసిందని చెప్పారు. సాహిత్య ప్రస్థానం ఆశయ పథంలో పయనిస్తూ, ప్రజాసాహిత్యానికి వేదికగా నిలిచిందని, వందలాది మంది కవులూ రచయితల స్వరాలకు, కలాలకు దన్నుగా నిలిచిందని అన్నారు. ఈ రెండు దశాబ్దాల్లో అనేక మంది సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులు ఆర్థికంగా, హార్దికంగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు. మతతత్వం, మార్కెట్ మాయాజాలం విజృంభిస్తున్న నేటి కాలంలో సాహితీ ప్రస్థానం ప్రాధాన్యత మరింత పెరిగిందని అన్నారు. సమాజాన్ని జాగృతం చేసే దిశగా సాహిత్యకారులు మరింత చురుకైన, పదునైన సాహిత్యాన్ని సృష్టించాలని అన్నారు.

నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ, అభ్యుదయ సాహిత్యం అందించే ప్రయత్నంలో ఎక్కడా రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రస్థానం పత్రికను నడపటం అభినందనీయమని అన్నారు. నిబద్ధతకు, విలువలకు ప్రతీకగా నిలిచే సంస్థ ఆధ్వర్యాన ఈ పత్రిక మరింత ముమ్ముందుకు సాగాలని ఆకాంక్షించారు. 20 వసంతాల ప్రత్యేక సంచికను ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ పరిచయం చేశారు. ఈ 20 ఏళ్లలో సమాజ పరిణామ క్రమాన్ని వివరించే, వ్యాఖ్యానించే అనేక కథలను, కవితలను ప్రస్థానం ప్రచురించిందని చెప్పారు. వాటిలో ఉదహరణీయంగా ఉన్న 9 కథలు, 24 వ్యాసాలను, కవితలను, కీలకమైన కార్యక్రమాల నివేదికలను ఈ సంచికలో ప్రచురించామని చెప్పారు. తెలంగాణా సాహితి అధ్యక్షులు కె.ఆనందారి మాట్లాడుతూ, సమాజంలో నెలకొన్న పలు రుగ్మతలను ఎత్తి చూపుతూ సాహితీ ప్రస్థానం తన గమనాన్ని కొనసాగించిందని అన్నారు. ఒక సమగ్రమైన ఆలోచనలకు ప్రస్థానం పునాది వేసిందని చెప్పారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి ఓ శాంతిశ్రీ మాట్లాడుతూ, గత 20 ఏళ్ల నుంచి అనేక ప్రత్యేక సంచికలతో ప్రస్థానం విశేషమైన కృషి చేసిందని చెప్పారు. విరసం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ, ప్రస్థానం శ్రేయోభిలాషులు సతీష్, కిషోర్‌లకు తెలకపల్లి రవి ప్రత్యేక సంచికను అందజేశారు. స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్యరంజన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జిఎం కె లక్ష్మయ్య, పలువురు సాహితీ వేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఏనుగుల గుంపు హల్‌చల్

ప్రజాశక్తి- ఐరాల (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో ఏనుగులు గుంపు హల్‌చల్ చేస్తోంది. ఐరాల మండలం వేదగిరివారిపల్లి గ్రామంలోని చుక్కావారిపల్లిలో 19 ఏనుగులు తిష్టవేశాయి. గత రెండు రోజులుగా గ్రామ శివారుల్లోని పొలాల్లో తిరుగుతూ పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయి. గ్రామంలోని అరటి, మామిడి, చెరకు పంటలను ధ్వంసం చేశాయి. అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను నేలమట్టం చేశాయి. చేతికొచ్చిన పంటలు ఏనుగుల వలన నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు పంట పొలాలను నాశనం చేస్తున్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని వాపోయారు. ఏనుగుల గుంపు గ్రామాల్లోకి ప్రవేశించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను అడవిలోకి తరిమేయాలని, ఏనుగులు ధ్వంసం చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరారు.

బిజెపితో పొత్తు హేయం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు చెబుతున్నారని, ఇంతకన్నా మోసం మరొకటి లేదని అన్నారు. అక్కడ జరిగింది కేవలం 22 శాతం పనులు మాత్రమేనని తెలిపారు. దీనిపై చంద్రబాబుతో తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రమల గురించి చర్చలు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను తిప్పికొట్టి వామపక్షాలు, కాంగ్రెస్‌లను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్, వామపక్షాలు అవగాహనతో పోటీ చేస్తాయని, సీట్ల విషయమై చర్చలు సాగుతున్నాయని చెప్పారు. నెల్లూరు నగరం నుంచి సిపిఎం పోటీ చేస్తోందని, త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మాదాల వెంకటేశ్వరు, ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.



పాడేరులో ఆదివాసీ నేత అప్పలనర్సను అరెస్టు చేస్తున్న పోలీసులు

మన్యం బంద్ జయప్రదం

(మొదటి పేజీ తరువాయి)

గిరిజన మ్యూజియం, రణజిల్లెడ జలపాతం తదితర సందర్శిత ప్రాంతాలు మూతబడ్డాయి. బంద్ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి గుండెకాయ వంటి జిఒ 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే వైసిపికి రానున్న ఎన్నికల్లో ఆదివాసీలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతగిరిలో బొర్రా గుహలు మూతపడ్డాయి. రంపచోడవరంలోనూ బంద్ జయప్రదమైంది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, నాయకులు మట్ల వాణిశ్రీ ఆధ్వర్యంలో గిరిజనులు అంబేద్కర్ జంక్షన్ వద్ద రహదారిపై బైఠాయించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం తదితర మండలాల్లో బంద్ జరిగింది. వ్యాపారులు దుకాణాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారు. ఏలూరు జిల్లా పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. పోలవరం ఏటిగట్టు, జీలుగుమిల్లిలో జాతీయ రహదారిపై, బుట్టాయగూడెం, కుక్కునూరు ప్రధాన సెంటర్లలో నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సిపిఎం, ప్రజాసంఘాల నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. బంద్‌లో భాగంగా శ్రీకాకుళం జిల్లా గొట్టిపల్లి, మందసలో ర్యాలీలు నిర్వహించారు. స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని, ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను కొనసాగించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యువతకు తీవ్ర అన్యాయం

- సిద్ధం సభలతో ప్రజాధనం దుర్వినియోగం
- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నానా అవస్థలు పడుతున్నారని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆమె మాట్లాడారు. 2.30 లక్షల ఉద్యోగాలిస్తామని జగన్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలో రెండు శాతం కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మెగా డిఎస్‌సి అని చెప్పి, దగా డిఎస్‌సి వేసి ఉద్యోగార్థులను వంచించారన్నారు. ఎపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తానన్న హామీని కూడా తుంగలో తొక్కారని విమర్శించారు. కేంద్రంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి మోసం చేసిందని, అదే కోవలో జగన్ ఉన్నారని, మోసానికి కేరాఫ్ అడ్రస్ బిజెపి అయితే.. ఈ అంశంలో బిజెపికి జగన్ వారసుడని షర్మిల అభివర్ణించారు. బిజెపి హయాంలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. యువకుల కోసం కాంగ్రెస్ పార్టీ ఒక నేషనల్ మేనిఫెస్టో ఇచ్చిందని, దీంతోపాటు యువరోషిణి పథకం ద్వారా రూ.5 వేల కోట్లతో ఉద్యోగ, ఉపాధి కోసం ఫండ్ ఏర్పాటు చేస్తుందని ఆమె వెల్లడించారు. జగన్ సిద్ధం సభలు ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఒక్కో సభకు రూ.90 కోట్లు ఖర్చుపెట్టి, ఇప్పటి వరకు దాదాపు రూ.600 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు కూడా లేకుండా చేశారని, ఏదైనా అంశంపై నిలదీస్తే హౌస్ అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఒక ఊసరవెల్లి అని, అవసరానికి రంగులు మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. బిజెపితో టిడిపి పొత్తు అనైతికమని ఆమె వ్యాఖ్యానించారు.

విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలి

- రాజకీయ పార్టీలను కోరిన ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఓ 117ను రద్దు చేయడంతోపాటు, కొఠారీ కమిషన్ సిఫార్సుల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, కేంద్ర బడ్జెట్‌లో ఆరు శాతం నిధులు విద్యా రంగానికి కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) విజ్ఞప్తి చేసింది. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు, తెలుగు మాధ్యమాన్నీ సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. విజయవాడలోని దాసరి భవన్‌లో ఉపాధ్యాయ వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలూ తమ వైఖరిని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు స్టేషన్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ నెల 12న వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరు డివిజన్‌లోని మొత్తం రెండు గతి శక్తి టెర్మినల్స్, 21 స్టేషన్లలో ఉత్పత్తి స్టాల్స్, ట్రాలీలు, నాలుగు డబ్లింగ్ ప్రాజెక్టులు, ఒక కోచ్ రెస్టారెంట్‌ను ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడు వద్ద చెట్టినాడు సిమెంట్స్ కోచ్, దాచేపల్లి మండలం తుమ్మలచెరువు, సాయి బాలాజీ వేర్ హౌసింగ్ లాజిస్టిక్స్ ప్రారంభిస్తారని చెప్పారు. స్టేషన్లలో వివిధ రకాల సంప్రదాయ ఉత్పత్తుల తయారీ యూనిట్ల రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. గుంటూరు వద్ద ఒక రైలు కోచ్ రెస్టారెంటు, గుంటూరు- గుంతకల్ సెక్షన్ మధ్య 4 డబ్లింగ్ ప్రాజెక్టులు వీటిల్లో ఉన్నాయన్నారు. పది స్టేషన్లలో 13 స్టాల్స్, 8 స్టేషన్లలో 8 ట్రాలీలు సుమారు రూ.64.51 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. దాచేపల్లి వద్ద సిమెంట్ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా రూ.130 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. తమ డివిజన్‌లో ఇప్పటి వరకు రెండు కోచ్ రెస్టారెంట్లను నిర్వహిస్తున్నా మన్నారు. 16 కిలో మీటర్ల దూరంలో సాతులూరు- మునుమాక మధ్య డబ్లింగ్, శావల్యాపురం -చీకటీగలపాలెం మధ్య డబ్లింగ్ 17 కిలో మీటర్ల మేరకు పనులు పూర్తి అయ్యాయని వెల్లడించారు.

ఆరోగ్య హక్కు చట్టం తేవాలి

- ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఐఎఎస్ అధికారి పివి.రమేష్

ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించి, వారి జీవితానికి భరోసా కలిగించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 'ఆరోగ్య హక్కు చట్టాన్ని' తీసుకురావాలని, ఈ అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలూ తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని వైద్యారోగ్యశాఖ మాజీ కార్యదర్శి పివి రమేష్ డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన, పూర్తిస్థాయి వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు, విశ్లేషకులు.. వైద్య సేవలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి లేకుండా ఆరోగ్యం ప్రజల హక్కుగా ఉండేలా ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పివి రమేష్ మాట్లాడుతూ.. మనిషి జీవనశైలిలో, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనేక వ్యాధులు విపరీతంగా విస్తరిస్తున్నాయని, వైద్య రంగంలో అనేక మార్పులు వస్తున్నా ఆధునిక వైద్యం పేదవాడికి అందే పరిస్థితి లేదని చెప్పారు.

అలాగే వీరికి అవసరమైన వైద్యం ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తిగా అందటం లేదని, భారీగా పెరుగుతున్న మందులు, వైద్యం ఖర్చులు భరించలేక మరింత పేదరికంలోకి ప్రజలు వెళ్లిపోతున్నారని అన్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం పొందే హక్కును కల్పిస్తూ రాష్ట్రాలన్నీ ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ సభ్యులు రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ వైద్యం అందించే రకంగా యూనివర్సల్ హెల్త్ కేర్ పద్ధతిని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేశామన్నారు. సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణయ్య, ప్రధాన కార్యదర్శి టి కామేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి విజయ ప్రకాష్, సిపిఎం, సిపిఐ, సిఐటియు, జై భారత్ నేషనల్ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ నల్లచట్టాలు రద్దు చేయాలి

- రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలి
- సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


చిత్తూరు రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తోన్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం చిత్తూరు రైల్వేస్టేషన్ ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో రైతులు ఢిల్లీలో మరో పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆందోళనలో పాల్గొన్న రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో జరిగే భారీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సామాన్యులకు అందుబాటులో ఉన్న రైల్వేను ప్రయివేటీకరణ చేసే దిశగా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి భారీ స్థాయిలో టికెట్ ధరలు పెంచుతున్నారని తెలిపారు. సిపిఎం నాయకులు జ్యోతి, లోకనాథం, ప్రసాద్, సిపిఐ నాయకులు గోపి, చంద్ర, రమాదేవి బాలాజీ పాల్గొన్నారు.

250 గ్రానైట్ పరిశ్రమలు మూసివేత

- సమస్యలు పరిష్కరించే వరకూ తెరిచే ప్రసక్తే లేదు : పరిశ్రమల యాజమాన్యం
- వీధినపడ్డ కార్మికులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రభుత్వ విధానాలకు నిరసనగా గ్రానైట్ అసోసియేషన్ పిలుపు మేరకు మార్టూరు ప్రాంతానికి చెందిన 250 గ్రానైట్ పరిశ్రమలను ఆయా యాజమాన్యాలు ఆదివారం నుంచి నిరవధికంగా పరిశ్రమను మూసివేశాయి. ఈ సందర్భంగా గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పత్తిపాటి సురేష్, షేక్ కాలేషావలి మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ గ్రానైట్ పరిశ్రమలను తెరిచే ప్రసక్తి లేదని తెలిపారు. పరిశ్రమలు మూతపడడంతో వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్న వివిధ రాష్ట్రాల కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పరిశ్రమలు మళ్లీ ఎప్పుడు తెరుచుకుంటాయో, అప్పటి వరకూ తమ కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలో అర్థం కాక కార్మికులు ఆవేదన చెందుతున్నారు. పరిశ్రమలు మూసివేత ఇంకొద్ది రోజులు ఇలాగే కొనసాగితే మూటముల్లే సర్దుకొని తమ సొంత రాష్ట్రాలకు వెళ్లడం తప్ప వేరే దారి లేదని వారు వాపోతున్నారు.


మూతపడిన గ్రానైట్ కంపెనీలు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్రంలో సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కాలంలో వచ్చిన పంటలకు కనీస మద్దతు ధర అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని కౌలు రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మొక్కజొన్న తదితర పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. దళారులందరూ కుమ్మక్కై పంట ధరలను తగ్గించి కౌలు రైతులను దగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

నిధులివ్వని కేంద్రం

అడుగుముందుకు పడని పెట్రో కెమికల్ కారిడార్ • నోరు మెదపని రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి


పెట్రో కారిడాక్ కోసం కేటాయించిన భూమి

రాష్ట్ర విభజన హామీల్లో భాగమైన కాకినాడ జిల్లాలో హెచ్‌పిసిఎల్, గెయిల్ సంస్థల ద్వారా రూ.32 వేల కోట్లతో 'పెట్రో కెమికల్ కారిడార్' ఏర్పాటుకు బిజెపి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. దీంతో, ఈ ప్రాజెక్టు ముందుకు కదలలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఈ ప్రాజెక్టు కోసం గత టిడిపి ప్రభుత్వం కాకినాడ సెజ్ ప్రాంతంలో సుమారు రెండు వేల ఎకరాల భూమిని కేటాయించింది. హెచ్‌పిసిఎల్ - గెయిల్‌తో 2017 జనవరిలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కుదిరింది. రూ.32 వేల కోట్ల ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఏర్పాటైన తర్వాత రెండు, మూడేళ్లలో పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులు పుంజుకుంటాయని, ఈస్ట్ కోస్ట్ కారిడార్లో రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశలు కల్పించారు. దీని అనుబంధ పరిశ్రమలతో కలుపుకొంటే మొత్తం రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఊదరగొట్టారు. ఒప్పందం జరిగి ఆరేళ్లు గడుస్తున్నా ఈ ప్రాజెక్టుకు అతీగతి లేకుండా ఉంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై కనీసం నోరు మెదపడం లేదు. దీంతో, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు ఉన్నట్లా? లేనట్లా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బిజెపి మొండి వైఖరి

ప్రత్యేక హోదా విభజన, హామీల అమలును కేంద్ర ప్రభుత్వం అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ముందుకు కదలలేదు. ఈ ప్రాజెక్టు విషయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కార్పొరేట్‌తోపాటు ఇతర పన్నుల కింద వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) విషయంపై నేటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. విజిఎఫ్ కింద ఏటా రూ.975 కోట్ల చొప్పున 15 ఏళ్లపాటు సమకూర్చాలని 2021లో జరిగిన సమావేశంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో స్పందన లేదు. దీంతో, కాకినాడ సెజ్‌లో పెట్రో కాంప్లెక్స్ కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో 'జె' ట్యాక్స్ వసూళ్లు

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- శంఖారావంలో నారా లోకేష్

ప్రజాశక్తి-రాయదుర్గం, ఉరవకొండ (అనంతపురం)

వైసిపి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండ్ కో రాష్ట్రంలో జె ట్యాక్సులు వసూలు చేస్తూ జనాన్ని అడుగడుగునా ఇబ్బందుల పాలుజేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో ఆదివారం శంఖారావం బహిరంగ సభలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. సిఎం జగన్ ఒక నియంత అని, తల్లీచెల్లిని ఇంటిని గెంటేసిన వ్యక్తి అని ఆరోపించారు. కల్తీ మద్యం, గంజాయితో ప్రజలను పీడిస్తున్నారని చెప్పారు. సలహాదారుల పేరిట కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చకు తాను సిద్ధమని అన్నారు. సమయం, తేది సిఎం జగన్ చెప్తే రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పేరిట ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వర్తింపజేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగులకు రూ.3000 నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.15వేలు, రైతులకు రూ.20వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వీటితో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తామన్నారు. సూపర్ సిక్స్ కేలండర్‌ను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత టిడిపి నాయకులు, కార్యకర్తలదేనని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ చెప్పేవి అబద్ధాలు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మేదరమెట్లలోనూ అబద్ధాల విషపు జల్లు చల్లారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. హామీలు నిలబెట్టుకున్నానన్న జగన్ మాట పచ్చి అబద్ధమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 85 శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పారని అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయినందునే సభకు లక్షమంది కూడా రాలేదని విమర్శించారు. మద్య నిషేధం అమలు చేశాకే ఓటు అడుగుతానని, 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని, అంగన్‌వాడీ వేతనాల పెంపు వంటి హామీల్లో మాట తప్పి మడమ తిప్పారని ఆరోపించారు. హామీకి భిన్నంగా విద్యుత్ ఛార్జీలు 9 సార్లు పెంచారని, ఉచిత ఇసుక రద్దు చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పోగొట్టారని విమర్శించారు.

పట్టాలు తప్పిన ప్యాసింజర్ రైలు

- లోకో పైలెట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొత్తవలస (విజయనగరం జిల్లా)


పట్టాలు తప్పిన రైలింజన్

విశాఖపట్నం నుంచి భవానీపట్నం వెళ్లే ప్యాసింజర్ రైలు విజయనగరం జిల్లా కొత్తవలస రైల్వే గేట్ సమీపంలో పట్టాలు తప్పింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి 7.10 గంటల ప్రాంతంలో జరిగింది. లోకో పైలెట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విశాఖపట్నం నుంచి వచ్చిన ప్యాసింజర్ రైలు కొత్తవలస రైల్వేస్టేషన్లో ఆగింది. స్టేషన్ నుంచి బయల్దేరిన రైలు.. వంద అడుగుల దూరం వెళ్లేసరికి.. ట్రాక్ మారుతుండగా ఇంజిన్ పట్టాలు తప్పింది. లోకో పైలెట్ ఎంహెచ్‌ఆర్ కృష్ణ అప్రమత్తమై రైలును నిలిపేశారు. దీంతో రైలు అక్కడికక్కడే నిలిచిపోయింది. ఈ ఘటనలో ఇంజిన్‌తోపాటు మరో భోగి కూడా పక్కకు ఒరిగింది. ఒక్కసారిగా రైలు కుదుపునకు గురవడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణాలపై రైల్వే ఉన్నతాధికారులు అంచనాలు వేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్యాసింజర్ రైల్లో ఉన్న ప్రయాణికులు కొత్తవలస జంక్షన్ నుంచి బస్సులో విజయనగరం వెళ్లారు. దూరప్రాంతాలకు వెళ్లే కొంతమంది ప్రయాణికులు తిరిగి కొత్తవలస రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో లైన్ క్లియర్ చేయడంతో కొత్తవలస నుంచి విజయనగరం వెళ్లే రైళ్లకు ఇబ్బంది తప్పింది. భవానిపట్నం వరకు వెళ్లే ప్రయాణికులను వేరే రైళ్లలో తరలించడానికి రైల్వే సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమకు నాలుగు రోజులుగా నీరు రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణం మొత్తం నీరు వస్తున్నా టిడ్కో గృహాలకు మాత్రం ఇవ్వడంలేదని తెలిపారు. నాలుగు రోజులు సక్రమంగా వస్తే మరో నాలుగు రోజులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలుండే టిడ్కో గృహాల వద్ద నీటి సమస్యను అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని వాపోయారు. నీటి సమస్య కారణంగా తమ పిలలను పాఠశాలలకు పంపలేకపోతున్నామని, ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ముందస్తు సమాచారమైనా ఇవ్వకుండా నీటిని ఆపేస్తున్నారని మహిళలు మండిపడ్డారు. నీళ్ల కోసం రోజు వారి పనులను కూడా మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

14న వైసిపిలోకి ముద్రగడ

ప్రజాశక్తి - కిర్లంపూడి (కాకినాడ జిల్లా)

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఈ నెల 14న తాడేపల్లిలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరనున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని తన నివాసరంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం పిలుపు మేరకు వైసిపిలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భారీగా కార్లు, బస్సులతో ర్యాలీగా తాడేపల్లికి వెళ్లనున్నట్లు ఆయన మీడియాకు వివరించారు. ఏ కారణంతో వైసిపిలో చేరుతున్నారు? పవన్ కల్యాణ్‌పై పోటీ చేస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పార్టీకి సేవ చేయాలనే ఉద్దేశంతో, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. తనకు గానీ, తన కుమారునికి గానీ ఎటువంటి సీటూ అడగలేదని, ఎటువంటి షరతులు లేకుండానే పార్టీలో చేరుతున్నానని తెలిపారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు తన పూర్తి స్థాయి సేవను పార్టీకి అందిస్తానని, వైసిపి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి గెలిచిన తర్వాత ఏ పదవి ఇచ్చినా స్వీకరిస్తానని, తాను మాత్రం ఏ పదవీ అడగనని చెప్పారు.


సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సిద్ధం సభలో ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన వైసిపి సిద్ధం సభకు ప్రజలను తొడ్కొని వెళ్లేందుకు 70 శాతం ఆర్‌టిసి బస్సులను ఆ పార్టీ నేతలు తీసుకోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం వెయ్యి బస్సులు ఉండగా 700 బస్సులు మేదరమెట్లకు పంపారు. ఆయా గ్రామాలు, పట్టణాల నుంచి వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు వీటిని అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు బస్సులు లేక ప్రజలు ప్రత్యామ్నాయంగా ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. గుంటూరు, మంగళగిరి, తెనాలి, నర్సరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, బాపట్ల, రేపల్లె తదితర డిపోల నుంచి మేదరమెట్ల సభకు 700 బస్సులను కేటాయించారు. .సిద్ధం సభ సమాచారం తెలియక చాలా మంది ప్రయాణికులు బస్‌స్టాండ్లకు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండగా ఒక్కోమార్గంలో ఒకటి రెండు బస్సులు రావడం వల్ల తీవ్రమైన రద్దీతో ప్రయాణించాల్సి వచ్చింది. ట్రాఫిక్ మళ్లింపులతో ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై వైపు వెళ్లాల్సిన వాహనదారులూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సభ మధ్యాహ్నం మూడు గంటలకైతే గుంటూరు, బాపట్ల జిల్లా అధికారులు ఉదయం ఆరు గంటల నుంచి వాహనాలను మళ్లించారు.



పుస్తకాలు నా మనస్సుకూ,
హృదయానికీ
రెక్కలనిచ్చాయి. నేను బురద నుంచి
బయటపడటానికి ఎంతో తోడ్పడ్డాయి.
పుస్తకాలు చదవకపోతే నా చుట్టూవున్న మౌఢ్యంలోనూ,
నీచంలోనూ మునిగి పోయి వుండేవాడ్ని. విశాలమైన
ప్రపంచ దృశ్యాలను పుస్తకాలు నా ముందు పరిచాయి.
– మాక్సిం గోర్కీ

వర్తమాన ప్రతిబింబాలు

మనలో చాలామందిమి మన జీవితాలకూ, రాజకీయాలకూ సంబంధం లేదనుకుంటాం. కానీ తెల్లారి లేచిందగ్గర నించి రాత్రి పడుకునేవరకూ రాజకీయాలు మన జీవితాల్లో చాపకింద నీరులాగా చేరి అల్లకల్లోల పరుస్తున్నాయని ఎప్పటికో తెలుసుకుంటాము. అలా తెలియపరచిన కథలే దేశరాజు గారి 'అలీబాబా అనేక దొంగలు' సంపుటిలోని కథలు.

ఇంద్రధనుస్సులో ఏడు రంగులుంటాయి. కానీ, మన దేశంలో ఇటీవల ఆ రంగులన్నీ కనిపించడం మానేసాయి. కేవలం కాషాయ వర్ణమే ఆకాశమంతా అలముకొని భయపెట్టేస్తోంది. దేశభక్తి, గో భక్తి ఎక్కువైపోయాయి. 'ఒకే దేశం ఒకే మతం' నినాదాలు ఎక్కువై పోయాయి. 'లౌకిక దేశం' అనే మాటకు అర్థం లేకుండా పోయింది. కేవలం ఒక మతంలో పుట్టినందుకు కొందరిపై దేశద్రోహుల ముద్ర వేసారు. వాళ్ల ఆహారంపై, వేషభాషలపై నిఘాలు ఎక్కువయ్యాయి. సోదరుల్లా కలిసిమెలిసి వున్నవాళ్లే ఈ దుష్ట రాజకీయాల వల్ల బద్ధ శత్రువుల్లా మారిపోతున్నారు. అకారణ విద్వేషం మనుషుల మధ్య ప్రజ్వరిల్లుతోంది. వీటన్నిటినీ కళ్ల ముందు నిలుపుతుంది 'అలీబాబా అనేక దొంగలు' కథ. సంపుటిలోని కథలన్నిటి కన్నా పెద్ద కథ అయినా, ఎక్కడా విసుగనిపించదు. వర్తమాన రాజకీయాలను వ్యంగ్యంగా ఆవిష్కరించిన కథ ఇది. ఎలాంటి ఋస పాటు సమాజంలో జీవిస్తున్నామో కదా అనే ఆవేదన కలిగిస్తుంది.

మనిషి ఇప్పుడు కరెన్సీకి దాసుడయ్యాడు. ప్రతి ఒక్కరూ రూపాయి వస్తుందంటే ఏం చెయ్యడానికైనా సిద్ధపడిపోతున్నారు. భార్యాభర్తల మధ్య, తండ్రి పిల్లల మధ్య ప్రేమలు లేవు, అనురాగాలు లేవు. వద్ధాప్య పింఛను వచ్చిన రోజే అత్తగారిని కోడలు మనిషిగా చూస్తుంది. ఇలాంటి డబ్బు వాసన కొట్టే ప్రపంచంలోనూ తాత్కాలికంగానైనా నిజమైన మనుషుల్లా ప్రవర్తించేవారు వుంటారని 'కాసేపు మనిషిలో' నిరూపిస్తారు. ప్రతిఫలాపేక్ష లేకుండా ఆకలి తీర్చిన ముసలావిడ ఔదార్యం ఓ సంపన్నుడిలోని మానవత్వాన్ని మేల్కొలుపుతుంది. చదువు ఆత్మవిశ్వాస దీపం వెలిగించి, నలుగురికీ ధైర్యం చెప్పేలా వుండాలి. కానీ, కార్పొరేట్ విద్యాలయ్యాల్లో చదువును కొనుక్కుంటున్న వ్యాపార కాలంలో ఫలితాలు వెలువడిన సందర్భాల్లో పసివాళ్ల ఆత్మహత్య వార్తలు వింటూనే వుంటాం. వీళ్లతోపాటు స్కూల్లో మాస్టారు తిట్టారనో, ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారనో ఉసురు తీసుకునే పిల్లలూ ఉన్నారు. మార్కులు తక్కువ వచ్చాయని తండ్రి తిట్టడంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన అపార్ట్‌మెంట్ వాసులందరినీ కలచివేయడం 'కుదుపు' కథ. ఆ విషాద వృత్తాంతం పెద్దల్లోనూ, పిల్లల్లోనూ కూడా మార్పు తీసుకు వస్తుంది. సెల్ ఫోన్‌కు బానిసలైనవారు ఆ అలవాటు నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తారు. జీవితంలో ఏదైనా మార్పు రావాలంటే కుదుపు తప్పదని ఈ కథ వివరిస్తుంది. ఈ సంపుటిలో 'అవాంఛితం' ఓ మంచి కథ. పురుషాధిక్య సమాజంలో స్త్రీల చిన్నచిన్న కోరికలు నెరవేరకుండా వుండిపోతుంటాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు వుండే మన దేశంలో ఇందులోని కథానాయికకి ఒకటే కోరిక– ఒళ్లంతా చల్లబడేలా తనొక్కత్తే ఏసీ గదిలో వుండాలని. సాధారణంగా ఇంట్లో ఒక్క ఏసీ గది మాత్రమే ఉంటుంది. ఆ గదిలో భర్త మాత్రమే స్వేచ్ఛగా, హాయిగా వుంటాడు. ఆమెకి కూడా అటువంటి గది ఒకటి అవసరమని భావించడు. ఆడవారికి ఇటువంటి కోరికలు ఉంటాయా? అదీ ఒక కోరికేనా? అని ఆమె కూడా సంకోచిస్తుంది. చివరకు భర్త మరణించిన సందర్భంలో ఆ కోరిక నెరవేరడం కథలో కొసమెరుపు. సున్నితమైన విషయాన్ని ఎక్కడా హద్దు మీరకుండా, అసభ్యతకు తావు లేకుండా చిత్రీకరించారు.

మరో కథ 'తల్లీ, కూతురు– మధ్యలో ఆమె' మూడు తరాలకు చెందిన స్త్రీల కథ. ఒకప్పుడు ఆడపిల్ల పెద్ద మనిషి అయితే, అప్పుడెలా వుండాలో రహస్యంగా చెప్పేవారు. ఇప్పుడు అవేమీ లేదు. ఒక తల్లి తన కూతురికి విషయంలో జాగ్రత్తలు చెప్తుంటే "ఆడుకుంటున్నప్పుడు దెబ్బలు తగలవా? అప్పుడు బ్లడ్ రాదా? ఇప్పుడెందుకు ఓవర్ చేస్తున్నావ్" అని అడుగుతుంది. తల్లికి తన తరంలో గుసగుసగా చెప్పుకున్నది ఇప్పుడు బట్టబయలుగా చెప్పుకోవడం ఆశ్చర్యపరుస్తుంది. ఒకప్పుడు కొన్ని విషయాలు మాట్లాడుకోవడానికే సిగ్గు పడితే, ఇప్పటి తరం అటువంటి సంకోచాలు లేకుండా ధైర్యంగా దూసుకుపోవడాన్ని ఈ కథలో చూడొచ్చు. తరాల అంతరాల్లో, ఆలోచనా విధానంలో వచ్చిన మార్పుకు అద్దం పడుతుంది ఈ కథ.

ఒక పెళ్లికొడుక్కి పల్లెటూరు అంటే ఇష్టం. అక్కడి అందాలు, అక్కడ అమ్మాయిల అమాయకత్వం అతనికిష్టం. పల్లెటూరి అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని పట్టుబడతాడు. చివరకు పెళ్లికొడుకు తల్లి నాటకమాడి కొడుకు పెళ్లి చేస్తుంది. చివరకు బాగా చదువుకున్న పట్నం అమ్మాయే పెళ్లి కూతురనే విషయం బయటపడటమే 'అంతా మీ కోసం' కథ. సృష్టిలో అనేక కోట్ల ప్రాణులున్నాయి. కానీ, అన్నిటిపై మానవుడు పెత్తనం చేస్తాడు. ప్రపంచాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. మనిషి ఆయా ప్రాణుల ఆవాసాల్లోకి చొరబడటంతో అవి మనుషులపై దాడి చేస్తున్నాయి. కొన్ని ఊళ్లలో పొలాలపై ఏనుగుల దాడి, పంటలపై కోతుల దాడి అని వార్తలు చదువుతూ వుంటాము. అపార్ట్‌మెంట్‌లో పావురాలు చొచ్చుకు రావడం వల్ల కలిగిన ఇబ్బందులను 'సహజాసహజం' కథలో చూడవచ్చు. పావురాలు వస్తుండటంతో అవి రాకుండా నెట్లు కడతారు. దాంతో వాటితో వుండే సాన్నిహిత్యం మాయమైపోతుందని దిగులు పడతారు. రాష్ట్రపతి ప్రయాణిస్తున్న విమానాన్ని హైజాక్ చెయ్యాలని ప్రయత్నిస్తున్న చైనాలోని ఉగ్రవాదుల ప్రయత్నాన్ని మన దేశంలోని బిగ్ క్యాట్ తిప్పికొట్టడమే 'ఎయిర్ జామ్' కథ. ఈ కథ ఒకప్పటి షాడో కథలను గుర్తుకు తెస్తుంది. మనసు యవ్వనంలో వుంటే సరిపోదు, శరీరానికి వయసు వస్తుంది. వద్ధాప్యం వస్తుంది. ఆ వయసుకి తగినట్లే ఎవరైనా ప్రవర్తించాలని చెప్తుంది 'చిలుక' కథ.

మధ్య తరగతి వర్గం వారు కూడా శ్రామిక వర్గాన్ని దోచుకోవడం గురించి కనులకు కడుతుంది 'రిక్షావోడు' కథ. ఈ కథ చదువుతుంటే త్రిపురనేని గోపీచంద్ రాసిన 'రిక్షావాడు' కథ గుర్తుకు వస్తుంది. ఈ బరువైన కథలన్నిటితోపాటు ఈ సంపుటిలో 'కవి దుర్భేద్య' అనే హాస్య కథ కూడా ఉంది. సాహిత్యంలోని ప్రక్రియలన్నిటిలో కవితా ప్రక్రియ విశిష్టమైనది. కానీ, కొంతమంది కవులు తమ నాసిరకమైన కవితలతో కవిత్వం అనే పదానికే అర్థం మార్చేస్తున్నారు. శతాధిక కవిసమ్మేళనాలు, సహస్ర కవిసమ్మేళనాలు వచ్చి కవుల పరువు తీస్తున్నాయి. 'బస్సులో వస్తూ రాసాను, రైల్లో ప్రయాణం చేస్తూ రాసాను' అని అంటారు చాలామంది. కవిత్వం రాయడమంటే చూచి కాపీ రాయడం కాదు. ప్రతిభ వుండాలి, నిరంతర సాధన వుండాలి. అప్పుడు కవికీ, కవిత్వానికీ గుర్తింపు వస్తుంది. ఈ కథలో ఒక ఉద్యోగి రిటైర్ అయ్యాక కవిత్వం రాయడం మొదలు పెడతాడు. వాట్సప్ గ్రూపులలో పంపించి, పేరు పొందుతాడు. సన్మానాలు చేస్తారు. బిరుదులు పొందుతాడు. అలా ఒక కవి దుర్భేద్యగా ఎదిగిపోతాడు.

ఈ సంపుటిలోని కథలన్నీ వర్తమాన జీవితాన్ని నిశితంగా పరిశీలించి రాసినవే. ఈ కథల్లోని పాత్రలు మన ఇరుగు పొరుగువారే కాదు, మనం కూడా. ప్రజలను పట్టించుకోకుండా, వారి మధ్య మత విద్వేషాలు రగుల్కొలిపే రాజకీయ నాయకుల దుష్టత్వం, పర్యావరణ విధ్వంసానికి మానవుడు ఎలా కారకుడవుతున్నాడు, విద్యావ్యవస్థలోని లోపాలను, మరుగున పడిన మానవత్వం గురించి చెప్పిన ఈ కథలన్నీ పాఠకులను తీవ్రంగా ఆలోచింపజేస్తాయి.

–మందరపు హైమవతి

పరిచయం



ఆలీబాబా అనేక దొంగలు,
దేశరాజు, వెల : రూ. 200, పుటలు: 120,
ప్రతులకు: 99486 80009

'నానీల తీరాన' కవిత్వ లహరులు

కవిత్వం లఘురూపమా? దీర్ఘరూపమా అన్నది కొలమానం కాదు. కవిత్వానికి కవిత్వమే కొలమానం. కవిత్వపు పస లేనపుడు రూపమేదైనా అది కవిత్వానికి శాపమే. ముఖ్యంగా లఘురూపాల కవులు అప్రమత్తంగా కవనసేద్యం చేయాలి. నిశితంగా పదపదాన్ని ఆచితూచి ప్రయోగించాలి. అలాంటి లఘురూపాల్లో నానీలు కవిత్వాన్ని పలికించడానికి అనువైనవిగా రాణించాయి. ఆచార్య గోపి రూపకల్పన చేసిన నానీలు కవితానురంజకంగా దశాబ్దాలకు పైబడి ప్రసరిస్తున్నాయి. కవిత్వశోభ ఆ లఘురూపాలకు ఆకర్షణ కావడమే కారణం. ఇపుడు ఎన్.లహరి 'నానీల తీరాన' అనే శీర్షికతో లఘుకవితల్ని రాసారు.

ఒంటినిండా
విలువైన ఆభరణాలు
హదయంలోనే
దయ నిండుకుంది!

నానీలో మొదటి యూనిట్ భౌతికమైన మెరుపుని ప్రస్తావన చేసి, రెండవయూనిట్ లో అభౌతికమైన నగని ఆవిష్కరణజేశారు కవయిత్రి. దేహకాంతి కన్నా హదయతేజం కీలకం. హదయంలో దయ నిండుకున్నాక నగలమెరుపు వెలవెల బోయినట్టు. ఎద్దేవా పలికింది.

ముఖానికి
ముసుగువేస్తావు
లోపలి వ్యథకు
వేయగలవా!?

బాహ్య జగత్తు ముఖం, అంతర జగత్తు లోపలి వ్యథ. ముఖంలో నటన వుండొచ్చు. కానీ లోపలివ్యథను దాచలేం. అది ఎంత అణచినా ఏదొక తూరి బయల్పడుతుంది. కనుక లోపలున్నదే బయటకు ప్రదర్శించాలి. కనుక ఈ నానీ లహరీ వాస్తవికతను గుర్తుజేస్తున్నది. లహరిలో హాస్యచతురత వుందనీ కొన్ని నానీలు చెబుతున్నాయి.

కడుపులో మంట
అజీర్తి కాదు
పక్కింటావిడ
పట్టుచీర కొన్నది.

కొన్ని నానీల్లో జీవన నిపుణతను ప్రబోధించేవి చోటు చేసుకున్నాయి.

"విషాదకెరటాలు / పోటెత్తితే
మధురజ్ఞాపకాల/ ఒడ్డును చేరుకుంటా

కవిత్వం దారిచూపదు కానీ, నడిచే దారిలో వచ్చే సమస్యలకు పరిష్కారం చూపాలి. లహరి బాధ పరిస్థితి వున్నప్పుడు మధురిమలను తలపుకు తెచ్చుకుంటాననడం ఉపశమనవైద్యమే.

అన్నింటికీ చావొక్కటే
మార్గమా!?
మరి లోకమంతా
ఎప్పుడో ఖాళీ అవ్వాలే!

చీటికీమాటికీ ఉరి పెట్టుకునే బలహీన మనస్తత్వాల కాలమిది. మరణం మార్గం కాదు. అలా అయితే లోకంలో బాధలతో మరణించి, శూన్యమయేదనీ కవయిత్రి ఎరుక పరుస్తున్నారు. సమకాలీన ఆత్మహత్యల కలతను కవితగా కూర్చారు.

స్త్రీలు కవిత్వం రాస్తే స్వపక్షాన్ని విస్మరించరు. కవిత్వంలో స్త్రీని ఆయుధంగా నిలబెడతారు. లహరి తన నానీలో స్త్రీ చైతన్యాన్నిలా వ్యక్తీకరించారు.

గులాబీని చూసి/ నేర్చుకో ఓ మహిళా!
చుట్టూ ఓ/ ముళ్లకంచె కూర్చుకో

గులాబీ మదువైనది. దాని రక్షణకు ముళ్లకాపలా వుంది. అలాగ స్త్రీ కూడా పురుష సమాజాన్నుంచి రక్షణగా ఓ ముళ్లకంచెను నిర్మించుకోమంటున్నది.

పంజరంలోనే / పక్షి భద్రమా!?
బయట/ అడుగడుగునా వేటగాళ్లు

స్త్రీల సమస్యల పట్ల బాధ్యతగా నిజాయితీగా నానీలెన్నో ఇందులో కనిపిస్తున్నాయి. ఆలోచింపజేస్తున్నాయి.

మానవ సంబంధాల పట్ల గురి కలిగిన నానీలున్నాయి.

జీవితంలో/ తప్పటడుగులు పడలే
నడిపించిన నాన్న/ ఉపాధ్యాయుడు

గురువు గొప్పతనమూ, నాన్న గొప్పతనమూ జమిలిగా చెప్పడం వుంది. శతం పితా ఆచార్యః అని నానుడి వుంది. వందమంది ఆచార్యులతో తండ్రి సమానం.

నక్షత్రాల హోటల్లో
టిప్పు సుల్తాన్లు
కూరలవ్వతో
కొసరి బేరాలు


వీధులంటా ఆకుకూరలమ్మే ముసలివాళ్లతో బేరాలు ఆడే నాగరీక జనం స్టార్ హోటళ్లలో సర్వర్‌కి టిప్పులిచ్చి మెప్పుగా ఫీలవ తుంటారు. బక్క వ్యాపారులపై కనికరాన్ని బోధించే నానీ ఇది.

అన్నిసార్లూ / మౌనం పనిజేయదు
అవసరమైనచోట/ శబ్దం శతఘ్నిలా పేలాలి

మౌనం కొన్నిసార్లు చేతకానితనంలా భావిస్తారు. అవసరమైనపుడు భాషను ఆయుధం చేసుకోమంటున్నది. ఆయుధం చేతికిచ్చేవాడే కవి లేదా కవయిత్రి.

లహరి నానీలు ఊహాపోహలు కాదు. సమాజాన్ని గాలించి రాసినవి. సమాజ కళ్యాణం కోసం ప్రభవించినవీ. కొన్ని నానీలు సాదాగా అనిపించినా ఎక్కువ నానీలు ప్రతిభావంతంగానే వున్నాయి. ప్రాసల మాయలో కవిత్వం స్టేట్ మెంట్ల రూపాన్ని దాల్చుతాయి. అలాగే పునరుక్తి దోషాన్ని గమనించుకోవాలి. ఏది ఏమైనా నానీల తీరంలో కవిత్వంగా జీవితం పండింది. సమాజం సేద్యమయింది. నానీ కవయిత్రి లహరికి అభినందనలు.

– మెట్టా నాగేశ్వరరావు





ఆస్థాన కోయిలలు

'కొండెపోగు' చెప్పినట్టు
ఈ ఆస్థాన కోయిలలు ఇలాగే కూస్తాయి
ప్రతి ఘటనను ప్లాస్టిక్ సర్జరీలతో
రక్తి కట్టించి రక్త గాయాలన్నీ కప్పేసి
తళుకు బెళుకుల తెల్లబొమ్మలా కోటింగేసి
ప్రపంచానికి చూపెడతాయి

వెన్నెముక జారిపోయిన ఈ మూలస్తంభాలు
ఇలాగే కుప్పబడి సరీసృపాల్లా పాకుతాయి
నైతిక నియమాల సహజ చర్మాన్ని కుబుసంలా విడిచి
పెట్టుబడుల తోలు కప్పుకొని
వక్ర భాష్యాల ఊడిగానికి సిద్ధపడతాయి
24/7 రీమిక్స్ వార్తాగానం చేస్తాయి

ఈ భజంత్రీల మేళతాళాలు
ఇలాగే మోతెక్కిస్తాయి
సత్యాన్ని సమాధి చేసి
సాక్ష్యాల తోటకు నిప్పు పెట్టి
అమాయకంగా నిలబడి
మంటల ముందు నివ్వెరపోయే
మొసలి కన్నీళ్లను
ఉదాత్తంగా కవిత్వీకరించి కీర్తిస్తాయి

నిజాలైన వేల అవిశ్వాసాల ఊపిరి
ఆగిపోయినా
అబద్ధాలైన లక్షల కట్టుకథలతో
అధికారం ధృడంగా కోటలు కట్టుకున్నా
స్వప్నమై బతికే ఒక్క విశ్వాసం చాలు
కాకిలా ఎగిరొచ్చి అదే కోట గోడమీద వాలి
నిజం గొంతై నినదిస్తుంది!

– కంచరాన భుజంగరావు
94415 89602

పదేళ్ల అక్రమ నిర్బంధం

చేయని తప్పు చేసాడని
కటకటాల వెనక్కి పంపిన రాజ్యం
అక్షరం హేతువును బోధిస్తుందని
హేతువు మార్క్సిజానికి మూలమనే దడ రాజ్యంలో
అక్షరానికి సంకెళ్ళు వేసింది

వందశాతం ఫాసిజం కోరలు పీకి
తొంభై శాతం వైకల్యం సాధించిన గెలుపు
ఇంకా తరాజులో న్యాయం వుందని తేల్చింది

ఎన్ని ఉదయాలు
ఎన్ని అస్తమయాలు ఈ పదేళ్లలో
తూర్పు పడమరల మధ్య ఊగాయో
ఓ కొత్త పొడుపు కోసం నిరీక్షించిన కళ్ళు

నిజాన్ని బంధిస్తే
అబద్ధాల రాజ్యానికి వెసులుబాటు
మసి పూసి మారేడు కాయ చేయజూస్తే
మసి పూసుకోక తప్పదు ఎన్నాళ్ళైనా!!

కోల్పోయిన సామాజిక జీవనం
చీకటి రాత్రుల్లో కోల్పోయిన వెలుగు
అడుగడుగునా ఆంక్షల నాలుగు గోడల మధ్య
తల్లడిల్లిన మేను
సమాధానాలు లేవు
వెల కట్టగలిగే ధైర్యం లేదు

ఏది ఉగ్రవాదం!
ఏ ఇజం హ్యూమనిజం!
వాడికీ వీడికీ మధ్య రాజేసే నిప్పు వెనుక
దాగిందే ఉన్మాదం!
ప్రశ్నని నేర్పే గురువే
నేటి సమాజానికి కావాలిప్పుడు!

– గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

చక్రాల బండి

ఎత్తైన కాంక్రీటు గోడల
కరుకైన కటకటాల
చెలిమికి సెలవిచ్చి
ఇన్నాళ్లూ ముసురుకున్న చీకటిరాయిని
వేకువ సంద్రంలోకి విసిరేసి
ఎగసిపడుతున్న అలల దారిలో
ఓ రెండు చక్రాల కుర్చీ
సత్యమేవ జయతే నినాదమై
నిర్గుణ కాంతిపుంజమై
తీక్షణంగా ప్రసరించబోతోంది

కన్నీరు అడుగంటి
నెర్రలిచ్చిన కంటిరేగడిలో
స్వేచ్ఛాస్వప్నం చిగురిస్తుంటే
గ్రహణం వీడిన చంద్రుని పెదవుల మధ్య
సన్నగా పురుడోసుకున్న చిరునవ్వు దీపం
వేల వర్ణాలను వెదజల్లబోతోంది

రేపు మళ్ళీ చీకటి రావచ్చు
రాకపోనూవచ్చు కానీ..
తప్పక వచ్చే ఆశల వెలుగు తీర్పు
ఎప్పటిలానే భరోసా తివాచీ పరచి
నిర్భయంగా నడిపిస్తోంది

న్యాయవ్యవస్థ పంచేంద్రియాలు
సక్రమంగా పనిచేయటానికి
పంచవర్ష ప్రణాళికల కాలం పట్టినా
చిల్లపెంకుల్లాంటి శిలల వనంలో
శిల్పమేదో తెలిసిపోయింది
మనస్సును తొలిచేస్తున్న
వ్యవస్థను ప్రశ్నిస్తున్న
మౌనగాయాలు ఇప్పటికైనా
విజయగీతాలు పాడుతున్నాయి

దేహమూ దేశమూ అవిటివైనా
రాజ్యాంగం తోడుగా
రాజ్యంపై చేస్తున్న యుద్ధంలో
జవసత్వాలు తరగిపోని
చదువుల చైతన్యం
జనజీవన స్రవంతిలోకి
చక్రాలబండెక్కి సగర్వంగా వస్తుంది
రండి! చేతులు కలిపిన
మానవ హారాల సాక్షిగా
వేలాది స్వేచ్ఛాతోరణాలు కడదాం!

– మిరప మహేష్,
99480 39026

స్వార్థపు బజారులో ...

స్నేహితులు కూడా వారి
ఆకాంక్షల రహదారిపై
అడ్డంకి అనుకుంటారు నన్ను
నేననుకునేవాడిని ఎన్నటికైనా
నా స్నేహితులు నన్నర్థం
చేసుకుంటారని..

అంధకార బంధురంలో
వెలుగురేఖనై వికసిద్దామనుకుంటే
బంధువులు తమ అభివృద్ధిరథానికి
వేగ నిరోధకమనీ భావిస్తున్నారు
పుణ్య పురుషులు నన్ను
పుణ్యాత్ముల జాబితాలో చేర్చితే
పాపులు తప్పొప్పుల దీపం వెలిగించి
మరీ నన్ను వారి చిట్టాలో
చేర్చడానికి ప్రయత్నిస్తున్నారు..

వేర్లు బలహీనమైనా
కొమ్మలు కొంతమేర ఒంగిపోతే
దూరమునుండి చూసినవారు
ఫలదారి అనుకున్నారు..
కొన్ని పత్రాలు రాలినంతనే
శిశిరమనుకున్నారంతా
కాలచక్రాన్ని గిర్రున తిప్పి
వసంతాన్ని నే తిరిగి ధరిస్తానని
మరిచారు వారంతా..

నా లోపలంతా శూన్యం నిండి
అంతర్గతంలో విహరిస్తుంటే
సమూహంలో కూడా ఏకాంతంగా
నుంచుంటే గర్వమనుకున్నారు
నిజాయితీ బజారులో బేజారయి
స్వార్థపు బజారులో నన్ను నేను
అమ్మకానికై పెడ్దామనుకుంటే
నన్నో ఖరీదుదారు అనుకుంటున్నారు!

– సర్ఫరాజ్ అన్వర్
94409 81198



నన్ను నేనే...

నా భయం నేనే అని తెలియక
ఎవరి తోడు కోసమో ఎదురు చూసా...
నాతో మాట్లాడు కోవడం తెలియక
ఎవరి గొంతు కోసమో
పడికాపులు కాచా ...
నా నడకలకు అందాన్ని అద్దలేక
దారి ఎత్తుపల్లాలను తప్పు పట్టా...

నాకు ఉన్నది మరచి
లేని దాన్ని ప్రేమించి పూజించా...
నాకు అక్కరలేని
ఇష్టాలను ఆహ్వానిస్తూ
నన్ను నేనే అవమానించుకున్నా...

– చందలూరి నారాయణరావు
9704437247

యుద్ధ విరామం

నువ్వు నేను
ఒకే క్షితిజ రేఖపై
ఉన్నామంటావు
అందరం సోదరులం అనే
మాట నీటిలో రాసావని
తెలీలేదు.
ఆప్యాయంగా కౌగిలించావనే
అనుకున్నా
వెనుక నెత్తురోడుతూ
అడుగులు వేస్తున్న నా నీడను
చూసేవరకు.

సరిహద్దులు కాలుదువ్వుతుంటే
లోపల కత్తులు, క్షిపణులు
పోటాపోటీగా
తయారవుతున్నాయి.

ఆధిపత్యపు కాన్సర్
అడుగడుకో భాగాన్ని
ఆక్రమిస్తోంది
ఎర్రని కణజాలాన్ని విస్తరిస్తూ.

ఆకలి, నిద్ర కలుసుకునేలోపు
తెగిపడ్డ దేహాలు వాటిని ఎడం
చేస్తున్నాయి

దేహాల డంపింగ్ యార్డులు
ఎర్రటి నేలలు
కొత్త రోదనాగీతం
ఆలపిస్తుంటే
రాబందులు దావత్
చేసుకుంటున్నాయి.

అరిచి అరిచి గొంతు
పెగుల్చుకున్న
శాంతి మంత్రాలు తాత్కాలిక
ఉపశమనపు గుళికలయ్యాయి.
యుద్ధకాంక్ష కాస్త విరామం
ప్రకటించింది!

– రాధకష్ణ కర్రి
99519 16499

జాతీయ స్థాయి వచన కవితల పోటీ

కెనడాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డా. నెల్లుట్ల నవీన్ చంద్ర ఆధ్వర్యంలో నడుస్తున్న కవితావేదిక సాహితీసంస్థ 2024వ సంవత్సరానికి జాతీయ స్థాయి వచన కవితలపోటీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి : రు.4,000, ద్వితీయ బహుమతి : రు.2,000, ఒటౌతీయ బహుమతి : రు.1,000. కవితా వస్తువు కవి ఐచ్ఛికం (కుల, మత, వర్గ, రాజకీయ అంశాలు మినహాయించి). కవిత గరిష్టంగా 25 పంక్తులు ఉండాలి. వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలి. కవితను యూనికోడ్ ఫార్మాట్‌లో మాత్రమే పంపాలి. కవిత పేరు, కవి పేరు, చిరునామా కవితపైన కాకుండా హామీపత్రంపై మాత్రమే రాయాలి. గడువు తేదీ : ఏప్రిల్ 30, 2024. **కవితలు nakshatra1364@gmail.comకు పంపాలి.**

పెన్నా సాహిత్య పురస్కారం -2023

పెన్నా సాహిత్య పురస్కారం – 2023కు గాను కవితా సంపుటాలు కోరగా 26 కవితా సంపుటాలు వచ్చాయి. శ్రీ వశిష్ట సోమేపల్లి రచించిన 'ఆకు రాలినచప్పుడు'ను ఈ అవార్డుకు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. త్వరలో జరగబోవు పెన్నా రచయితల సంఘం వార్షికోత్సవ సభలో పురస్కారం అందజేయడం జరుగుతుంది. కవితా సంపుటాలు పంపిన కవులందరికి ధన్యవాదాలు.

– అవ్వారు శ్రీధర్ బాబు,
అధ్యక్షులు

డా.బండి సత్యనారాయణకు ఉమ్మడిశెట్టి అవార్డు

36వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు –2023 కోసం డా.బండి సత్యనారాయణ కవిత్వం 'ఒంటి కాలు పరుగు' కవిత్వం ఎంపికైనట్లు ప్రకటిస్తున్నాం. న్యాయ నిర్ణేతలుగా విజయ కుమార్ కోడూరి, జి.వెంకట కృష్ణ, ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి వ్యవహరించారు. డా.బండి కవిత్వంలో సున్నితత్వం కన్పించినా బాధితుల పక్షాన దుఃఖగాఢత వినిపిస్తుందని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా కవిత్వం రాస్తున్న సీనియర్ కవి డా.బండి సత్య నారాయణ (99890 35136) ఆకాశవాణి, విశాఖలో సీనియర్ అనౌన్సర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు కోల్పోయిన దుఃఖం నుంచి మా గురువు గారు ఇంకా కోలుకోలేదు గనుక వారి తరపున చొరవ తీసుకొని అవార్డు విజేతను మేము ప్రకటిస్తున్నాం.

– డా. పెళ్ళూరు సునీల్,
డా.సుంకర గోపాలయ్య,
దోర్నాదుల సిద్ధార్థ

ప్రజాశక్తి
www.prajasakti.com

మణిపూర్‌లో పర్యటించండి

- మోడీని కోరుతూ మణిపూర్ యువతి నిరాహార దీక్ష

న్యూఢిల్లీ : గత సంవత్సరం మే నుండి మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లేందుకు దేశ రాజధానిలో 26 సంవత్సరాల మాలెమ్ తంగమ్ నిరాహార దీక్ష ప్రారంభించి మూడు వారాలు గడిచిపోయాయి. మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించాలని, శాంతిని, సాధారణ పరిస్థితులను నెలకొల్పే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ఆమె కోరుతున్నారు. ఆపరేషన్స్ నిలిపివేతపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, కుకీ గ్రూపుల మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయాలని కూడా ఆమె డిమాండ్ చేస్తున్నారు. తంగమ్ గత నెల 22న తన స్నేహితులతో కలిసి ఢిల్లీ యూనివర్సిటీలో నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఆ తర్వాత ఆమె వివిధ రూపాల్లో తన నిరసనను తెలియజేశారు. ఫిబ్రవరి 27న తిరిగి మణిపూర్ చేరుకున్నప్పటికీ ఇంఫాల్‌లో దీక్షను కొనసాగించారు. ఆత్మహత్యకు పూనుకున్నారన్న ఆరోపణపై మణిపూర్ పోలీసులు ఆమెను ఈ నెల 2న అరెస్ట్ చేశారు. ఐదవ తేదీని విడుదల చేసి తిరిగి 6న అరెస్ట్ చేశారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగేలా నిరసల తెలిపారంటూ ఆరోపణ మోపారు. తంగమ్ ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను పోలీసులు ఆస్పత్రిలో చేర్చారు. అయితే చికిత్సకు నిరాకరించిన తంగమ్ తన దీక్షను కొనసాగిస్తున్నారు.

ఇఎఫ్‌టిఎతో భారత్ ఒప్పందం

న్యూఢిల్లీ : ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఇఎఫ్‌టిఎ)తో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం అనేక పారిశ్రామిక ఉత్పత్తులపై ముఖ్యమైన సుంకాలను ఎత్తివేసేందుకు భారత్ అంగీకరించింది. దీనికి ప్రతిగా ఇఎఫ్‌టిఎ దేశాలు వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడం కోసం భారత్, ఇఎఫ్‌టిఎ మధ్య గత 16 ఏళ్ల వ్యవధిలో అనేక రౌండ్లు జరగడం విశేషం. ఇఎఫ్‌టిఎలో స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లైచ్టెనెస్టియా దేశాలు ఉన్నాయి. ఇవన్నీ నాన్ యురోపియన్ దేశాలు. ఎగుమతులను పెంచడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధిని సృష్టించడం వంటి లక్ష్యాల సాధనకే ఇఎఫ్‌ఎటితో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. అయితే భారత్ నుంచి ఇఎఫ్‌ఎటి దేశాలకు 2022-23 నాటికి ఎగుమతులు 1.92 బిలియన్ డాలర్లు ఉండగా, ఈ దేశాల నుంచి దిగుమతులు మాత్రం 16.74 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

యూసఫ్ పఠాన్, రచనకు చోటు

- టిఎంసి లోక్‌సభ అభ్యర్థుల జాబితా

కోల్‌కతా: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పశ్చిమ బెంగాల్‌లో టిఎంఎం ఆదివారం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. బహరామ్‌పుర్ నుంచి మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ బరిలో దిగనున్నారు. హుగ్లీ నుంచి నటి రచనా బెనర్జీకి అవకాశం కల్పించారు. ఆమె తెలుగులో బావగారు బాగున్నారా?, కన్యాదానం, మావిడాకులు చిత్రాల్లో నటించారు. అవినీతి ఆరోపణలపై పార్లమెంటు సభ్యత్వం కోల్పోయిన మహువా మొయిత్రా మరోసారి కృష్ణానగర్ నుంచి పోటీ చేయనున్నారు. ఎనిమిది మంది సిటింగ్‌లను పక్కకు తప్పించారు. ఆదివారం నుంచి కోల్‌కతా వేదికగా ఎన్నికల ప్రచారాన్ని టిఎంసి చీఫ్ మమతా బెనర్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ జాబితాను ప్రకటించారు. 'ఇండియా' వేదికలో భాగమైనప్పటికీ.. రాష్ట్రంలో ఒంటరిగానే బరిలోకి దిగుతున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. మొత్తం 42 స్థానాలకుగానూ అభ్యర్థులను ప్రకటించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక స్థానం నుంచి పోటీకిగానూ సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో చర్చలు జరుపుతున్నట్లు మమతా తెలిపారు. అస్సాం, మేఘాలయాలోనూ పోటీ చేస్తామన్నారు.

హద్దు మీరినా ఇజ్రాయిల్‌కే మద్దతు

- అమెరికా అధ్యక్షుడు బైడెన్

విల్మింగ్టన్ : యుద్ధోన్మాదంతో రగిలిపోతూ గాజాలో మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు అమెరికా మరోమారు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గాజాపై దాడుల విషయంలో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు తాము అన్ని విధాల మద్దతుగా ఉంటామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి నిస్సిగ్గుగా ప్రకటించారు. గాజా విషయంలో నెతన్యాహు తీసుకుంటున్న చర్యలు ఇజ్రాయిల్‌కే నష్టం చేస్తాయని, గాజాపై దాడుల విషయంలో నిబంధనలకు ఇజ్రాయిల్ కట్టుబడి లేదని చెబుతూనే...ఎంత హద్దు మీరినా అంతిమంగా తమ మద్దతు ఇజ్రాయిల్‌కే ఉంటుందని చెప్పారు. ఇజ్రాయిల్ దేశ రక్షణ, అక్కడి పౌరుల భద్రత చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆ దేశానికి కొన్ని రకాల ఆయుధాలను అందించటం, ఐరన్ డోమ్ వ్యవస్థకు మద్దతివ్వటం వంటి విషయాల్లో రాజీ ఉండదని స్పష్టం చేశారు. తన అభిప్రాయాన్ని నేరుగా ఇజ్రాయిల్‌కు వెళ్లి అక్కడి పార్లమెంటుకే తెలియజేయాలనుకుంటున్నానని బైడెన్ వెల్లడించారు.




రైలు పట్టాలపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న రైతులు

పంజాబ్‌లో పట్టాలెక్కిన అన్నదాతలు

- 62 ప్రాంతాల్లో రైలు రోకో
- హర్యానాలో రైతుల నిర్బంధం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో తమ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, రైతులందరికీ రుణమాఫీ అమల్జేయాలని కోరుతూ అన్నదాతలు ఆందోళనలను ఉధృత్వంగా కొనసాగిస్తున్నారు. పంజాబ్‌లో 62 ప్రాంతాల్లో రైతులు రైలు రోకో నిర్వహించారు. రైల్వే స్టేషన్లలోకి దూసుకెళ్లి పట్టాలపై కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మరోవైపు హర్యానాలోనూ వివిధ రూపాల్లో ఆందోళనలకు సిద్ధమైన అన్నదాతలను అక్కడి బిజెపి ప్రభుత్వం నిర్బంధించింది. పలుచోట్ల 144 సెక్షన్ విధించి అణిచివేతకు పాల్పడింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు రైలురోకో నిర్వహించారు. ఈ ఆందోళనల్లో వేలాది మంది పాల్గొన్నారు. పంజాబ్‌లో 62 ప్రాంతాల్లో రైలు రోకో చేపట్టగా 49 రైలు సర్వీసులు రద్దు అయ్యాయి. ఇంటర్ సిటీ లైన్లతో పాటు ప్రధాన లైన్లు కూడా రైలు రోకో ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి. హర్యానా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వందలాది మంది రైతులను అక్కడి ప్రభుత్వాలు నిర్బంధించాయి. హర్యానాలోని దబ్వాలి, ఎల్లెనాబాద్‌లో అనేక మంది రైతులు ఆందోళన ప్రదేశాలకు వెళుతుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌లోని దౌసాలో కూడా ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. హర్యానా బిజెపి ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతిఘటించి అన్నదాతలు మూడు చోట్ల రైలు రోకో చేపట్టారు. అంబాలాలోని మోహదా రైల్వే క్రాసింగ్, పంచకులలోని మనక్‌పూర్, అంబాలాలోని సర్సిని రైల్ రోకో జరిగింది.

కిసాన్ మజ్దూర్ మంచ్ (కెఎంఎం) సమన్వయకర్త సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ రాజస్థాన్‌లోని పిలిబంగ, తమిళనాడులోని తంజావూరు, మధ్యప్రదేశ్‌లోని ఝబువాతో పాటు అనేక ఇతర ప్రాంతాల్లో కూడా రైతులు రైలు రోకో నిర్వహించారని తెలిపారు. రైళ్లను అడ్డుకోవడం తమకే సంతోషకరమైన విషయం కాదని, అయితే కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలియజేసేందుకు మరో మార్గం లేకపోయిందని ఆయన అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సమన్వయకర్త జగ్జిత్ సింగ్ దల్లెవాల్ మాట్లాడుతూ రైతుల సమస్యలు ఆలకించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం సాహసించలేకపోతోందని, రైతుల ఆందోళనను చూసి అది పారిపోతోందని విమర్శించారు. బికెయు షహీద్ భగత్ సింగ్ ప్రతినిధి తేజ్వీర్ సింగ్ మాట్లాడుతూ హర్యానాలో రైతులపై బిజెపి ప్రభుత్వ నిర్బంధ చర్యలను ఖండించారు.

ఎస్‌బిఐపై సిపిఎం కోర్టు ధిక్కార పిటిషన్

న్యూఢిల్లీ : మార్చి 6తో ఎలక్టోరల్ బాండ్ సమాచారాన్ని అందించే గడువు ముగియడంతో ఎస్‌బిఐకి వ్యతిరేకంగా సిపిఐ(ఎం) కోర్టు ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసింది. పార్టీ తరపున ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కోర్టును ఆశ్రయించారు. సమాచారం ఇచ్చేందుకు కోర్టు విధించిన కాలపరిమితిని ఎస్‌బిఐ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్‌లో పేర్కొనని అంశాల కారణంగా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం, తప్పుడు బాష్యాలు చెప్పడం వంటివి చేస్తోందని, బాండ్లను కొనుగోలు చేసిన వారు, వాటిని మార్చిన వారి సమాచారం సరిపోలాలని కోర్టు ఆదేశించలేదు. కానీ ఈ చెప్పని విషయాన్ని ముందుకు తెచ్చి ప్రాక్టికల్ ఇబ్బంది ఉందని చెప్పి కాలయాపన చేస్తున్నారు. బాండ్ కొనుగోలుదారులు, వాటిని క్యాష్ చేసిన వారి గురించి సమాచారాన్ని అందించడంలో అమలు చేయదగిన నిషేధం ఉందని కేసులో ఏ సమయంలోనూ ఎస్‌బిఐ పేర్కొనలేదు. ఒక్క క్లిక్‌తో సమాచారం మొత్తం అందుబాటులోకి వచ్చేసేదానికి బ్యాంకు కోర్టును అయోమయానికి గురిచేస్తోంది. ఇది కోర్టు ధిక్కారమేనని సిపిఎం పేర్కొంది. గడువును మూడున్నర నెలలు పొడిగించాలని కోరుతూ బ్యాంకు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం కోర్టు విచారణ చేపట్టనుంది.

నీట్ దరఖాస్తులకు గడువు పెంపు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) యుజి (నీట్ యుజి 2024) పరీక్ష దరఖాస్తులకు గడువును ఆదివారం పొడిగించారు. ఈ నెల 9న దరఖాస్తులకు గడువు ముగియగా.. తాజాగా ఈ నెల 16 వరకు గడువు పొడిగిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్ణయం తీసుకుంది. నీట్ పరీక్షను మే 5న ఎన్‌టిఎ నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

ఇది కోర్టు గౌరవానికి సంబంధించిన సమస్య

- ఎవరినో రక్షించడానికి ఎస్‌బిఐ తాపత్రయం
- ఎస్‌బిఐ ధిక్కారంపై కపిల్ సిబాల్



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్‌బిఐ కోర్టు ధిక్కారానికి పాల్పడినందున, ఇప్పుడు తన గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపై ఉందని ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ సభ్యులు కపిల్ సిబాల్ పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి6వ తేదీకల్లా ఎన్నికల సంఘానికి అందజేయాలని సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాన్ని అమలు చేయడానికి బదులు జూన్ 30 వరకూ గడువు పొడిగించాలని ఎస్‌బిఐ కోరడాన్ని సిబాల్ తప్పుపట్టారు. ఆదివారం నాడు ఒక వార్తా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ, డిజిటల్ యుగంలో సైతం ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించడానికి అనేక వారాల గడువు కోరడం వెనుక 'ఎవరినో రక్షించే ఉద్దేశం ఎస్‌బిఐకి ఉందని స్పష్టమవుతోందని అన్నారు. ఆ ఉద్దేశమే లేకపోతే మరో 116 రోజుల గడువు ఎస్‌బిఐ కోరేది కాదని అన్నారు. ఏప్రిల్-మేలో ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికల బాండ్ల వివరాలు బయటకొస్తే అధికార బిజెపి తీవ్ర ఇరకాటంలో పడుతుందని కూడా ఎస్‌బిఐకి తెలుసని కపిల్‌సిబాల్ అన్నారు. అధికారంలో ఉన్న పెద్దల ఆదేశాలతోనే ఎస్‌బిఐ ఈ నాన్పుడు ధోరణినవలంభిస్తోందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా ఎన్నికల బాండ్ల వివరాలు బయటకు రాకుండా అడ్డుకోడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని అడ్డదారులు తొక్కుతోందని ఆయన విమర్శించారు. ఈ విషయంలో ఎస్‌బిఐ ఇచ్చిన విచిత్రమైన వివరణను సుప్రీంకోర్టు అంగీకరిస్తే అది నవ్వులపాలవుతుంది. కాబట్టి తన గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపై ఉంది అని ఆయన అన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు సీట్లు నిరాకరిస్తున్న ఐఐటీలు

- ఫ్యాకల్టీ నియామకాలు, పిహెచ్‌డి ప్రవేశాలలో ఇదే పరిస్థితి
- నిత్యకృత్యమైన వేధింపులు, వివక్ష
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులు



న్యూఢిల్లీ : ఫ్యాకల్టీ నియామకాలు, పిహెచ్‌డి ప్రవేశాల స్థాయిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు దక్కాల్సిన రిజర్వేషన్ కోటాను ఐఐటీలు తోసిపుచ్చుతున్నాయి. ఆయా వర్గాలకు సీట్లు నిరాకరిస్తున్నాయి. దీంతో ఆ సంస్థల్లో వారి ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో ఐఐటి ఖరగ్‌పూర్‌లో పిహెచ్‌డి అడ్మిషన్ల సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు చెందిన 34 మంది విద్యార్థులకు సీట్లు నిరాకరించారు. ఈ సంస్థలో 45 డిపార్ట్‌మెంట్లు ఉండగా వాటిలో 43 డిపార్ట్‌మెంట్లలో ఒక్క ఎస్‌సి ఫ్యాకల్టీ కూడా లేరు. గత సంవత్సరం ఈ సంస్థలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి తరగతులకు చెందిన ఒక్క మహిళా ఫ్యాకల్టీని కూడా నియమించలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలు వెలుగు చూశాయి.

ప్రభుత్వ, న్యాయస్థానాల ఆదేశాలు ఉన్నప్పటికీ ఫ్యాకల్టీ నియామకాలు, పిహెచ్‌డి అడ్మిషన్లలో రిజర్వేషన్ నిబంధనల్ని ఖరగ్‌పూర్ ఐఐటి ఉల్లంఘించిందని విద్యార్థులు ఆరోపించారు. పైగా ఆయా వర్గాల విద్యార్థులపై వేధింపులు నిత్యకృత్యమయ్యాయని, వివక్ష జడలు విప్పుతోందని, దీనిని భరించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని చెబుతున్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఐఐఎంలలో గత ఐదు సంవత్సరాల కాలంలో 13,500 మంది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థులు మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పారు. ఈ సంవత్సరం జనవరి నాటికి ఖరగ్‌పూర్ ఐఐటీలో 742 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. వీరిలో 92% మంది జనరల్ కేటగిరీ వారే. 40 మంది ఒబిసి, 17 మంది ఎస్‌సి లు, కేవలం ఇద్దరు మాత్రమే ఎస్‌సి లు ఫ్యాకల్టీ స్థాయిలో ఉన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రవేశాలు, ఫ్యాకల్టీ నియామకాలలో ఎస్‌సి లకు 15%, ఎస్‌సి లకు 7.5%, ఒబిసిలకు 27% రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంటుంది. గత సంవత్సరం ఈ సంస్థలో ఒక్క ఎస్‌సి ని కూడా ఫ్యాకల్టీగా తీసుకోలేదు.

గత ఏడాది ఖరగ్‌పూర్ ఐఐటి 101 మంది బోధనా సిబ్బందిని నియమించింది. వీరిలో ఎస్‌సి లు ఇద్దరు మాత్రమే ఉండగా ఒబిసిలు పది మంది ఉన్నారు. పిహెచ్‌డి అడ్మిషన్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. 345 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తే వారిలో ఎస్‌సి లు 46, ఎస్‌సిలు 9, ఒబిసిలు 82 మంది ఉన్నారు. ఇది ఒక్క ఖరగ్‌పూర్ ఐఐటిలో నెలకొన్న పరిస్థితి మాత్రమే. దేశంలో మొత్తం 22 ఐఐటిలు ఉన్నాయి. అవన్నీ దాదాపుగా బలహీన వర్గాలకు సీట్లను నిరాకరిస్తున్నాయి. ఉదాహరణకు ఢిల్లీ ఐఐటిలో 32 డిపార్ట్‌మెంట్లు ఉండగా వాటిలో 25 బ్రాంచీలలో ఒక్క ఎస్‌సి విద్యార్థి కూడా లేడు. పది డిపార్ట్‌మెంట్లలో ఎస్‌సి విద్యార్థి లేడు. ఆరింటిలో ఒబిసి విద్యార్థులు లేరు. పిహెచ్‌డి ప్రవేశాలలో సుమారు 70% జనరల్ కేటగిరీకి చెందిన వారే ఉన్నారు. ఫలితంగా బలహీనవర్గాలకు దక్కాల్సిన 132 సీట్లను ఢిల్లీ ఐఐటి నిరాకరించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆ సంస్థలో ఇద్దరు ఎస్‌సి విద్యార్థులు మాత్రమే పిహెచ్‌డీలో అడ్మిషన్ పొందారు. గత ఎనిమిది నెలల కాలంలో ఐఐటీలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు వేధింపులు, వివక్ష భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు దళితులు కాగా ఒకరు ఒబిసి. ఇక కాన్పూర్ ఐఐటిలో జనవరి నాటికి 567 మంది ఫ్యాకల్టీ సభ్యులు ఉండగా వారిలో 87% మంది జనరల్ కేటగిరీకి చెందిన వారే. ఈ సంస్థలోని 14 డిపార్ట్‌మెంట్లలో ఎస్‌సి ఫ్యాకల్టీలు లేరు. 19 బ్రాంచీలలో ఒక్క ఎస్‌సి ఫ్యాకల్టీ కూడా లేరు. మూడు బ్రాంచీలలో ఒబిసి ఫ్యాకల్టీలు లేరు. బాంబే ఐఐటీలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ప్రస్తుత సంవత్సరంలో 394 మంది ఈ సంస్థలో చేరగా వారిలో 66% మంది జనరల్ కేటగిరీకి చెందిన వారే. 20 బ్రాంచీలలో ఎస్‌సి విద్యార్థులు, 11 బ్రాంచీలలో ఎస్‌సి విద్యార్థులు, ఐదు డిపార్ట్‌మెంట్లలో ఒబిసి విద్యార్థులు లేరు.

సిఇసితో విభేదాలే కారణమా?

(మొదటి పేజీ తరువాయి)

7న కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశాలకు సిఇసితో పాటు గోయెల్ కూడా హాజరయ్యారు. కానీ ఆ మరునాడు ఎన్నికల ఏర్పాట్లపై ఇసి అధికారులు, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా మధ్య జరిగిన సమావేశానికి కూడా ఆయన హాజరుకాలేదు. రాజీనామా విషయంలోనూ సిఇసికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా రాష్ట్రపతికి తన రాజీనామా లేఖను పంపారు.

గోయెల్‌కు నచ్చచెప్పేందుకు, సిఇసితో ఆయనకు ఉన్న విభేదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వైపు నుండి ప్రయత్నాలు జరిగినప్పటికీ ఆయన తన పట్టు వీడలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గోయెల్ రాజీనామాను రాష్ట్రపతి శనివారం నాడు ఆమోదించిన విషయాన్ని న్యాయ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది. ఈ నోటిఫికేషన్ వెలువడే వరకు సిఇసికి, ప్రభుత్వంలోని కొందరు ఉన్నతాధికారులకు తప్ప గోయెల్ రాజీనామా గురించి ఎవరికీ తెలియదు. అరుణ్ గోయెల్ 2022 నవంబరులో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వెంటనే ఎన్నికల కమిషనర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. అప్పట్లో ఆయన నియామకం వివాదాస్పదం కాగా, ఇప్పుడు ఆయన రాజీనామా చర్చనీయాంశమైంది.

గోయెల్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటారని ఆయనతో కలసి పనిచేసిన అధికారులు చెబుతున్నారు. ఆయన రాజీనామా ఇసి స్వతంత్రతపై అనేక ప్రశ్నలు రేకెత్తిస్తోందని వారు అంటున్నారు. ఎన్నికల కమిషనర్‌గా నియామకం కావడానికి ముందు ఆయన ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మరో ఎన్నికల కమిషనర్ అనుప్ చంద్ర పాండే పదవీకాలం గత నెలలోనే ముగిసినందున ఇప్పుడు కమిషన్‌లో ఒక్క రాజీవ్ కుమార్ మాత్రమే ఉన్నారు.

లావాసాను కేంద్రం వెంటాడింది

గోయెల్ రాజీనామాపై కేంద్రం వివరణ ఇవ్వాలిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో అప్పటి ఎన్నికల కమిషనరు లావాసా ప్రధాని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని, ఆయనపై చర్య తీసుకోవాలని కోరినందుకు, ఎన్నికలు ముగియగానే ఆయన నివాసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేశాయని, దీంతో ఆయన ఎన్నికల కమిషనరు పదవికి రాజీనామా చేశారని కాంగ్రెస్ నేత విమర్శించారు. రాజ్యాంగ సంస్థల పనిలో ఎలాంటి పారదర్శకత ఉండడం లేదని ఆయన అన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులకు వారంలో ఐదు రోజులే పని

- ఆమోదం తెలిపిన డిఎఫ్ఎస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులందరికీ వారంలో ఐదు రోజుల పనికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) ఆమోదం తెలిపినట్లు సమాచారం. దీనికి సంబంధించి ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయాల్సివుంది. అలాగే, 2022, నవంబర్ 01 నుంచి అమలులోకి వచ్చే వార్షిక వేతన పెంపులో 17 శాతం పెంపుపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ), బ్యాంకుల యూనియన్లు రెండూ ఏకాభిప్రాయాన్ని వచ్చినట్లు ఐబిఎ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ మెహతా ఆదివారం ట్వీట్ చేశారు. కాగా 'ఐదు రోజుల పని' నిర్ణయంతో ప్రభుత్వ రంగ బ్యాంకులకు దాదాపు రూ.8,284 కోట్ల వార్షిక వ్యయమవుతుందని అంచనా. 2022, నవంబర్ నుంచి అమలులోకి వచ్చే వేతన పెంపు సుమారు 800,000 మంది బ్యాంక్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిసింది. సవరించిన వేతన పరిష్కారంలో, మహిళా ఉద్యోగులకు మెడికల్ సర్టిఫికేట్ అవసరం లేకుండా నెలకు ఒక అనారోగ్య సెలవు రోజు మంజూరు చేస్తారు. అదనంగా, పదవీ విరమణ తర్వాత లేదా సేవ సమయంలో ఉద్యోగి మరణించిన సందర్భంలో సేకరించిన ప్రివిలేజ్ లీవ్‌ను 255 రోజుల వరకు నగదుగా మార్చుకోవచ్చు. రిటైర్డ్ వ్యక్తులు ఎస్‌బిఐతో సహా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పెన్షన్ లేదా కుటుంబ పెన్షన్‌తో పాటు నెలవారీ ఎక్స్‌గ్రేషియా చెల్లింపును అందుకుంటారు. 2022, అక్టోబర్ 31లోపు పెన్షన్ పొందే అర్హత ఉన్న పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లకు, ఆ నిర్దిష్ట తేదీన పదవీ విరమణ చేసిన వారితో సహా ఇది వర్తిస్తుంది. ఈ అంశంపై ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయాల్సివుంది.

చిన్న పరిశ్రమలను చిదిమేసిన మోడీ సర్కార్

- ఏకంగా 2.5 కోట్ల సంస్థలు మూత
- మల్లికార్జున ఖర్గే విమర్శలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి అమల్జేస్తున్న బడా కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలోని చిన్నపరిశ్రములు చితికిపోయాయని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఏకంగా 2.5 కోట్ల చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఇ) మూతపడ్డాయని ఖర్గే తెలిపారు. ఆదివారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 1.3 కోట్ల ఎంఎస్ఎంఇలు పెరిగితే మోడీ హయాంలో మూసివేతలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. పెద్ద నోట్ల ఉపసంహరణ, లోపభూయిష్ట జిఎస్‌టి, కోవిడ్ నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ కారణాల వల్ల చిన్న పరిశ్రములు చితికిపోయాయని ఆయన తెలిపారు.

ఎంఎస్ఎంఇల్లో ఉద్యోగుల సంఖ్య కూడా ఈ పదేళ్లలో క్రమంగా క్షీణించిపోయిందన్నారు. 2013-14 కాంగ్రెస్ హయాంలో ఎంఎస్ఎంఈల్లో 11.14 కోట్ల మంది ఉద్యోగులు ఉపాధి పొందగా 2022-23 (మోడీ ప్రభుత్వ హయాం)లో ఉద్యోగుల సంఖ్య 11.1 కోట్లుగా ఉందని గుర్తు చేశారు. 2020 మే 12న ప్రధాని నరేంద్ర మోడీ రూ. 20 లక్షల కోట్లతో ఎంఎస్ఎంఇలకు ప్రత్యేక ప్యాకేజ్ ప్రకటిస్తూ గొప్పగా ప్రచారం చేసుకున్నా..వాస్తవంలో ఆ ప్యాకేజీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. ప్రధానమంత్రి ముద్ర పథకం దుస్థితి కూడా అంతేనని ఆయన తప్పుబట్టారు. ఈ పథకం కింద గరిష్ఠ పరిమితిగా రూ.10 లక్షలు రుణం మంజూరుకు అవకాశమున్నట్లు ప్రచారం చేస్తుంటే..సగటున కేవలం రూ. 52 వేల మాత్రమే రుణంగా అందుతోందని ఖర్గే తెలిపారు.

ఢిల్లీ జల్‌బోర్డు ప్లాంటులోని బోరుబావిలో పడి వ్యక్తి మృతి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని జల్‌బోర్డు ప్లాంటులో ఉన్న ఒక బోరుబావిలో పడి గుర్తుతెలియని వ్యక్తి (30) ఒకరు చనిపోయారు. ఢిల్లీ మంత్రి అతిషి ఆదివారం సాయంత్రం ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. సదరు వ్యక్తి బోరుబావిలో ఎలా పడిపోయారనే విషయాన్ని దర్యాప్తులో తేలాల్సివుందన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం ఉదయం కేశపుర్ మండిలోని జల్‌బోర్డు ప్లాంటులో ఉన్న 40 అడుగుల లోతైన బోరుబావిలో ఈ వ్యక్తి పడిపోయారు. తొలుత చిన్నారి పడిపోయినట్లు భావించారు. అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు సహాయచర్యలు చేపట్టారు. బోర్‌వెల్‌కు సమాంతరంగా మరో బోరుబావి తవ్వేందుకు సన్నాహాలు చేశారు. బోర్‌వెల్ లోపల చాలా చీకటిగా ఉండటంతో సహాయక సిబ్బంది నిస్సాహాయత వ్యక్తం చేశారు. చివరకు బోరుబావిలో పడిన వ్యక్తి చనిపోయినట్లు నిర్ధారించారు. మంత్రి అతిషి ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ పరిధిలోని వృథా బోరుబావులన్నిటిని 48 గంటల్లోగా ఇనుప కవచాలతో మూసివేసి వాటిని వెల్డింగ్ చేయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

400 స్థానాలివ్వండి.. రాజ్యాంగాన్ని మార్చేస్తాం

- బిజెపి ఎంపి అనంత కుమార్ వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన సిపిఎం

బెంగళూరు : సార్వత్రిక ఎన్నికల్లో తమకు 400 స్థానాలు ఇస్తే దేశ రాజ్యాంగాన్ని తిరగరాస్తామని కర్ణాటకకు చెందిన బిజెపి ఎంపి అనంత కుమార్ హెగ్డే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతమున్న హిందూవులకు సముచిత ప్రాధాన్యాత ఇవ్వలేదని, అందువల్ల ఈ రాజ్యాంగాన్ని తిరగరాయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అందువల్ల బిజెపికి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని కోరారు. హిందువులకు అనుకూలమైన రీతిలో రాజ్యాంగాన్ని బిజెపి మాత్రమే మార్చగలదని చెప్పుకొచ్చారు. ఆరేళ్ల కిందట కూడా అనంత కుమార్ ఇలాంటి వివాదస్పద వ్యాఖ్యలే చేశారు. అప్పట్లో భారత రాజ్యాంగ పీఠికలో మార్పులు చేయాలని, లౌకికవాద పదాన్ని తొలగించాలని వాగారు. ఇప్పుడు కూడా అదే తరహా వ్యాఖ్యలు చేయడంతో హెగ్డే వివాదస్పద వ్యక్తిగా మారారు. ఆయన వ్యాఖ్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. హెగ్డే వ్యాఖ్యలు భారత ప్రజాస్వామ్య సూత్రాలకే విఘాతమని ఆందోళన వ్యక్తం చేసింది. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి మరింత బలోపేతంగా పోరాడాల్సివన అవశ్యకతను ఈ సందర్భంగా సిపిఎం నొక్కి చెప్పింది. రాజ్యాంగాన్ని అణగదొక్కే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని సిపిఎం స్పష్టం చేసింది. 'ప్రజాస్వామం పట్ల మా నిబద్ధత తిరుగులేనిది. రాజ్యాంగానికి ఎలాంటి ముప్పు వచ్చినా ఎదురు తిరిగి పోరాడతాం' అని సామాజిక మాధ్యమాల్లో సిపిఎం పునరుద్ఘాటించింది. హెగ్డే వ్యాఖ్యలపై కాంగ్రెస్ కూడా తీవ్రంగా స్పందించింది. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగానికి బిజెపి వ్యతిరేకమనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన రివర్స్‌మోడ్

- కారు ప్రమాదంలో ఫార్‌మోస్ట్ సిఇఒ మృతి



టెక్సాస్ : అత్యాధునిక సదుపాయాలు ఒక్కొక్కసారి ప్రమాదాలు తెచ్చిపెడుతుంటాయి. టెస్లా కంపెనీకి చెందిన ఎక్స్ ఎస్‌యువి కారును రివర్స్‌మోడ్‌లో నడపడంతో ఒక నిండు ప్రాణం బలైపోయింది. టెక్సాస్‌లోని ఆస్టిన్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో అమెరికా సెనెట్ రిపబ్లిక్ నేత మిచ్ మెక్ కన్నెల్ మరదలైన ప్రముఖ షిప్పింగ్ కంపెనీ ఫార్‌మోస్ట్ సిఇఒ ఏంజెలా (50) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గత శుక్రవారం రాత్రి ఏంజెలా హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లోని తన స్నేహితులతో కలిసి ఆస్టిన్ సమీపంలో సువిశాలమైన ప్రయివేటు అతిథి గృహానికి వెళ్లారు. ప్రధాన భవనానికి కారు వెళ్తుండగా మార్గమధ్యలో త్రీపాయింట్ టర్న్ రావడంతో దానిని దాటే క్రమంలో.. ఏంజెలా పొరబాటున తన టెస్లా ఎక్స్ ఎస్‌యూవీ కారును రివర్స్ మోడ్‌లోకి మార్చారు. దీంతో కారు వేగంగా వెనక్కి వెళ్లి సమీపంలోని కొలనులోకి బోల్తా కొట్టింది. కారు నీటిలో పూర్తిగా మునిగిపోవడంతో శ్వాస అందక ఆమె చనిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమెరికాలో అత్యంత సంపన్నులుగా పేరొందిన చావో కుటుంబానికి చెందిన ఏంజెలాకు భర్త..ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్ట్ అయిన జిమ్ బ్రెయార్, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. అమెరికా మాజీ రవాణాశాఖా మంత్రి ఎలాయినే చావోకు ఆమె సోదరి.

Government of India

సశక్త్ నారి - విక్షిత్ భారత్

లఖ్‌పతి దీదీలు మరియు నమో డ్రోన్ దీదీలతో
ప్రధానమంత్రి **నరేంద్ర మోదీ** పరస్పర చర్చ
మరియు తక్కువ వడ్డీ రేట్లకు రూ.8000 కోట్ల బ్యాంకు
రుణాల పంపిణీ మరియు
నమో డ్రోన్ దీదీస్‌కు 1094 డ్రోన్‌ల పంపిణీతో పాటు
SHG లకు రూ.2000 కోట్ల క్యాపిటలైజేషన్ మద్దతు



నమో డ్రోన్ దీదీ

- సాంకేతికత మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో SHG మహిళలను అనుసంధానం చేయడం
- నమో డ్రోన్‌లతో తక్కువ సమయంలో ఎరువులు మరియు పురుగుమందులను ప్రభావవంతంగా పిచికారీ చేయడం మరియు శ్రమను ఆదా చేయడం
- నమో డ్రోన్ దీదీలను నమో డ్రోన్ పైలట్‌గా మార్చడం ద్వారా ఆర్థిక సాధికారత









లఖ్‌పతి దీదీ

- 3 కోట్ల SHG మహిళలను లఖపతి దీదీలుగా ఎనేబుల్ చేసేందుకు నిబద్ధత
- ఆర్థిక స్వావలంబన కోసం శిక్షణ మరియు సహాయం
- అనేక జీవనోపాధి అవకాశాల ప్రచారం

గౌరవ అతిథులు

గిరిరాజ్ సింగ్
కేంద్ర గ్రామీణాభివృద్ధి &
పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు

అర్జున్ ముండా
కేంద్ర గిరిజన వ్యవహారాలు & వ్యవసాయం మరియు
రైతుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు

డా. మన్సుఖ్ మాండవియా
కేంద్ర ఆరోగ్యం & కుటుంబ సంక్షేమం మరియు రసాయనాలు
& ఎరువులు మంత్రివర్యులు

సమయం:- ఉదయం 10:00గం.లు, 11 మార్చి 2024

వేదిక:- సి.సుబ్రమణ్యం ఆడిటోరియం, **PUSA**, న్యూఢిల్లీ

కార్యక్రమాన్ని డిడి న్యూస్‌లో ప్రత్యక్ష ప్రసారం మరియు
https://pmindiawebcast.nic.in/ వెబ్‌కాస్ట్‌లో చూడండి

cbc 35101/13/0009/2324

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68